

నీటి మూటలే..!

● నవ్విపోదురు గాక.. మాకేంటి? ● గత ఎన్నికలపుడు వైసీపీ నేతల హామీలే.. హామీలు.. ● ఐదేళ్లలో వాటి ఊసే లేదు
● ఎక్కడి సమస్యలు అక్కడే ● మళ్లీ..హామీలు గుప్పిస్తున్న నేతలు ● మదనపల్లెలో పరిష్కారం కాని సమస్యలు

చిప్పిలి సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మాణం పూర్తయినా.. మట్టి పనులకే పరిమితమైన మొరవ నిర్మాణం


మదనపల్లె మండలం చిప్పిలి వద్ద నిర్మించిన సమ్మర్ స్టోరేజీ ట్యాంకు


మదనపల్లె మండలంలో విస్తరణకు నోచుకుని హంద్రీ-నీవా పుంగనూరు బ్రాంచి కెనాల్ పనులు

మదనపల్లె, ఏప్రిల్ 20: గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, వాగ్దానాలు గాలికొదిలేసిన నేతలు మళ్లీ ఎన్నికలు వచ్చాయని తగుదునమ్మా అంటూ ప్రచారానికి రావడం చూస్తే ఎవరెన్ని అన్నా మాకేంటి అనే విధంగా వ్యవహరిస్తున్నారు. గత ఎన్నికల సమయంలో నెలకొన్న ప్రజల సమస్యలపై పదవీ కాలం మొత్తం నోరెత్తకుండా ప్రస్తుతం మళ్లీ ఎన్నికల ప్రచారం మొదలెట్టారు. ప్రచారంలో భాగంగా స్థానిక సమస్యల పరిష్కారమే కాదు, అభివృద్ధిని ఆకాశానికెత్తేస్తామని హామీలు గుప్పిస్తున్నారు అధికార వైసీపీ నాయకులు. అయిదేళ్ల అధికారంలో ఉన్నంత కాలం ఏమీ చేయలేని వారు మళ్లీ ఇదే హామీల నినాదంతో ప్రజల ముందుకొస్తున్నారు. 2019 ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీ చేసి గెలుపొందిన ఎం.నవాజ్‌బాషా మదనపల్లె నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి పథంలో నడిపిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. అభివృద్ధి పనులే కాదు.. దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని పెండింగ్ పనులూ పూర్తి చేస్తామని నమ్మించారు. కానీ నాలుగున్నరేళ్లలో ఆయన ఇచ్చిన హామీల్లో ఒక్కటంటే ఒక్కటి కూడా పూర్తి చేయలేదు.

● మదనపల్లె పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి శాశ్వత పరిష్కారంపై చిప్పిలి, వలసపల్లె పంచాయతీలోని గుట్టకిందపల్లె సమ్మర్ స్టోరేజీ (ఎస్ఎస్ ట్యాంకులు) పూర్తి చేసి పట్టణ ప్రజల దాహార్తిని తీరుస్తానని హామీ ఇచ్చారు. అయితే నేటికీ ఆ రెండు ట్యాంకుల పనుల్లో పురోగతి లేదు. టీడీపీ ప్రభుత్వంలో రిజర్వాయర్లు పూర్తి కాగా, మొరవ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. అప్పటికే ప్రభుత్వం మారిపోవడంతో ఆ పనులు చేపట్టలేదు. తర్వాత నాలుగున్నరేళ్ల వైసీపీ ప్రభుత్వంలో పార మట్టి కూడా ఎత్తలేదు.

● నియోజకవర్గ, డివిజన్ కేంద్రం మదనపల్లె నుంచి నిమ్మనపల్లె, రామసముద్రం మండలాలను కనెక్టివిటీ చేస్తూ సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరిస్తామని హామీ ఇచ్చారు. రోడ్డు విస్తరణ పనులు చేపట్టకపోగా, కనీసం గతుకులకు అతుకులు కూడా వేయలేదు. ధ్వంసమైన రోడ్లు, కంకర తేలిన గుంతలతో ఇప్పటికీ ఈ మార్గంలో వాహనదారులు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. మదనపల్లె-రామసముద్రం మార్గంలో నాలుగుచోట్ల ప్రమాద మలుపులను కొంతవరకూ మార్పు చేసే పనులు చేపట్టారు. ముఖ్యంగా ఈ మార్గం గుండా మదనపల్లె నుంచి బెంగళూరుకు ఎక్కువగా వెళ్తుంటారు. రామసముద్రం మీదుగా చిత్తూరు-బెంగళూరు హైవేకి చేరుకోవడానికి అవకాశం ఉంది. కానీ మదనపల్లె-రామసముద్రం మధ్య 25 కి.మీ. రోడ్డు ఇరుకుగా ఉండడం, అక్కడక్కడా కంకర లేచి గుంతలు పడడంతో వాహనదారులు ఈ మార్గం గుండా ప్రయాణించాలంటే భయపడుతున్నారు. మరోవైపు ఈ రోడ్డులో మలుపులు, మిట్టలు ఎక్కువగా ఉన్నాయి. ఈ క్రమంలో లింకురోడ్డు అనుకూలంగా లేకపోవడంతో అక్కడి ప్రజలు అటు పుంగనూరు, ఇటు కర్ణాటక ప్రాంతాలకు తరలిపోతున్నారు. ఇక 17 కి.మీ. దూరం గల మదనపల్లె-నిమ్మనపల్లె రోడ్డు కూడా గుంతలు పడి, కంకర తేలింది. సింగిల్‌రోడ్డు కావడంతో ఎదురుగా వచ్చే వాహనాలు పక్కకు తొలగాలంటే ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో టీడీపీ ప్రభుత్వంలో ఏడు కి.మీ. మేర రెండుచోట్ల డబుల్‌రోడ్డు పనులు చేపట్టగా, తర్వాత మారిన వైసీపీ ప్రభుత్వం మిగిలిన పనులు చేపట్టలేదు.



● మదనపల్లెలో పీటముడిగా మారిన ట్రాఫిక్ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడతామని ఇచ్చిన పాలకుల హామీలు నీటిమూటలయ్యాయి. పట్టణంలో ప్రధాన రహదారుల వెంబడి ఆక్రమణలు తొలగించి పాదచారులకు దారి సౌకర్యం కల్పించలేదు. పట్టణంలో లింకురోడ్లను కలపనూ లేదు. రద్దీ ప్రాంతాలైన ఆర్.ఆర్.వీధి, అప్పారావువీధి, నెహ్రూబజార్, సీటీఎం రోడ్డు, చిత్తూరు బస్టాండు ఏరియాల్లో ద్విచక్ర వాహనదారులకు పార్కింగ్ సౌకర్యం కల్పిస్తామన్న హామీ నెరవేరలేదు. అంగళ్లు నుంచి వచ్చే వాహనాలు బెంగళూరు వైపు వెళ్లడానికి పట్టణంలోకి రాకుండా, బెంగళూరు వైపు నుంచి వచ్చే వాహనాలు పట్టణంలోకి రాకుండా పుంగనూరు వైపు వెళ్లడానికి వీలుగా ఔటర్‌రోడ్డు ఏర్పాటు చేస్తామన్న హామీ నెరవేరలేదు.

● మదనపల్లె మీదుగా వెళ్తున్న హంద్రీ-నీవా నీటిని నియోజకవర్గం పరిధి నిమ్మనపల్లె బాహుదానదికి మళ్లిస్తామని రైతులకు ఇచ్చిన హామీ ఈ నాలుగున్నరేళ్లలో నీటి మూటగానే మిగిలిపోయింది. పుంగనూరు బ్రాంచి కెనాల్ నుంచి హంద్రీ-నీవా జలాలను రామసముద్రం మండలానికి తీసుకెళ్లి అక్కడి చెరువులను నింపుతామన్న ఎంపీ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి, ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా మాటలు రైతులకు అరచేతిలో వైకుంఠం చూపిన విధంగా మారాయి.

● మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాల్లో ఎక్కువగా సాగయ్యే టమోటా ఆధారిత పరిశ్రమ, శీతల గిడ్డంగులు ఏర్పాటుతో రైతుకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్న హామీ ఏమీ లేకుండానే పదవీకాలం ముగిసిపోయింది.

● రామసముద్రంలో ముస్లిం మైనార్టీ సౌకర్యార్థం షాదీమహల్ నిర్మిస్తామని ఎన్నికల ప్రచారంలో భాగంగా నవాజ్ బాషా స్థానికులకు హామీ ఇచ్చారు. ఎన్నికల అనంతరం 2021లో ఎంపీ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే శిలాఫలకం ఆవిష్కరించారు. అంతేకానీ ఇంతవరకూ అక్కడ ఎలాంటి పనులూ చేపట్టలేదు. అదేరోజున మండలంలో ప్రముఖ వాలీశ్వరస్వామికొండపై ఉన్న ఆలయానికి తారు రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఈ రెండు పనులూ ఇప్పటి వరకూ చేపట్టలేదు.

● తన అన్న అయిన మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా హయాంలో మదనపల్లె కదిరిరోడ్డులోని వక్ఫ్ బోర్డు స్థలంలో ముస్లిం మైనార్టీలు ఏర్పాటు చేసుకున్న వివిధ విభాగాల తాత్కాలిక షెడ్లను పోలీసులు, అధికారుల సాయంతో కూల్చేశారు. తద్వారా వందమంది వరకూ ఉపాధి కోల్పోయారు. అప్పట్లో అన్నదమ్ముళ్ల నడుమ కొనసాగిన అంతర్యుద్ధంలో భాగంగా వీటిని తొలగించడం తీవ్ర చర్చనీయాంశమైంది. దీనిపై షాజహాన్ బాషా ముస్లిం మైనార్టీలకు జరిగిన అన్యాయంపై తమ్ముడిని బాధ్యుడిని చేస్తూ, అధికారులపై కోర్టుకు వెళ్లారు.

● మదనపల్లె పట్టణం, పరిసర ప్రాంతాల్లో తన అనుచరులు ఎక్కువగా రియల్ లేఅవుట్లు వేశారు. మున్సిపాలిటీ, పంచాయతీల్లో ప్రజావసరాలకు భూమిని కేటాయించడంలో తన అనుచరులకు ఓ విధంగా, మరొకరికి ఇంకోవిధంగా వ్యవహరించారనే అపవాదు మూటగట్టుకున్నారు.

● నీరుగట్టువారిపల్లెలో చేనేతలు అధికంగా ఉన్నారు. చేనేత మగ్గాలు నిర్వహిస్తున్న నివాసాలు, భవనాలకు విద్యుత్ మీటర్లు, మున్సిపల్ ఆస్తిపన్ను కమర్షియల్ కేటగిరీలో వస్తున్నాయి. వీటిని రెసిడెన్షియల్ కింద మార్పు చేస్తామని హామీ ఇచ్చినా అవి అమలు కాలేదు. టీడీపీ ప్రభుత్వంలో ఒక్కో చేనేత కార్మికుడి సిల్కు కిలోపై రూ.200 సబ్సిడీతో నెలకు గరిష్ఠంగా 4 కిలోలకు రాయితీ వస్తుండగా, వైసీపీ ప్రభుత్వం ఈ విధానాన్ని పూర్తిగా రద్దు చేసింది. అయితే చేనేతలకు కన్నీళ్లు తుడిచేలా నేతన్న నేస్తం పేరుతో ఏటా రూ.24 వేలు ఇవ్వడాన్ని కూడా కొందరికే పరిమితం చేసింది. దీంతో చేనేత కార్మికులు ఎక్కువగా నష్టపోవాల్సి వస్తోంది. మదనపల్లెలో ఉత్పత్తి అయ్యే పట్టుచీరలకు బ్రాండ్ ఇమేజ్ కల్పిస్తామన్న నేతల హామీలు అమలుకు నోచుకోలేదు. చేనేత రంగానికి ఇచ్చిన హామీల్లో చేనేత భవన్ నిర్మాణం మాత్రం పూర్తిచేశారు.


మదనపల్లెలోని చేనేత మగ్గం

అయ్యో.. పాపం..

● వివాహేతర సంబంధానికి కుటుంబం బలి ● ముగ్గురు పిల్లలతో సహా నీటిలో దూకి తల్లి ఆత్మహత్య
● నలుగురి మృతితో గాలివీడులో విషాదఛాయలు ● మృతురాలి భర్తపై కేసు నమోదు



గండిమడుగులో పడి ఆత్మహత్య చేసుకున్న నలుగురి మృతదేహాలు, నాగరాణి, నవ్యశ్రీ, దినేశ్, జాన్వి (ఫైల్)

గాలివీడు, ఏప్రిల్ 20: ఎంతో అన్యోన్యంగా సాగుతున్న ఆ కుటుంబంలో వివాహేతర సంబంధం ఒక్కసారిగా కలకలం రేపింది. ముగ్గురు పిల్లలు ఉన్న ఆ కుటుంబ పెద్ద మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. దీనిని తట్టుకోలేక అభం శుభం తెలియని చిన్నారులతో కలిసి ఆ తల్లి గండిమడుగులోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ విషాదకర సంఘటన మండల కేంద్రమైన గాలివీడులో జరిగింది. గాలివీడు ఎస్ఐ వెంకటప్రసాద్ కథనం మేరకు... వివరాల్లోకి వెళితే.. వేముల విక్రమ్ అనే వ్యక్తికి రామాపురం మండలం చిట్లూరు పంచాయతీకి చెందిన నాగరాణి (30)తో 12 సంవత్సరాల క్రితం వివాహమైంది. వివాహమైన కొన్ని సంవత్సరాలు వీరు అన్యోన్యంగా జీవించారు. వీరికి నవ్యశ్రీ (10), దినేశ్ (6,) జాన్వి (3) అనే ముగ్గురు పిల్లలు ఉన్నారు. గాలివీడు సచివాలయంలో గ్రామ వలంటీర్‌గా విధులు నిర్వహిస్తున్న వేముల విక్రమ్ భార్య నాగమణి తన ముగ్గురు పిల్లలతో కలిసి మండల కేంద్రంలోని చిలకలూరిపేటలో నివాసముంటున్నారు. అయితే కుటుంబ పోషణకు సరిపడా ఆదాయం లేకపోవడంతో విక్రమ్ వలంటీర్‌గా ఉంటూ ఆటో నడిపేవాడు. ఇదే క్రమంలో మద్యానికి బానిసై రెండేళ్ల నుంచి వేరే మహిళతో వివాహేతర సంబంధం కొనసాగించాడు. ఇదే విషయమై పలుమార్లు భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. రెండు రోజుల క్రితం వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళకు బిడ్డ కూడా పుట్టినట్లు తెలియడంతో ఈ విషయంపై శుక్రవారం రాత్రి భార్యాభర్తల మధ్య మరొకసారి పెద్దఎత్తున గొడవ జరిగినట్లు పోలీసులు తెలిపారు. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన నాగరాణి శుక్రవారం 8 గంటల సమయంలో ఇంటి నుంచి తన ముగ్గురు పిల్లలను తీసుకుని బయటికి వెళ్లింది. ఆమె తల్లితో ఇంట్లో జరిగిన గొడవ గురించి ఫోన్‌లో తెలియజేసిందని తెలిపారు. అనంతరం ఆమె వెలిగల్లు ప్రాజెక్టుకు దిగువన ఉన్న గండిమడుగులో తన ముగ్గురు పిల్లలను అందులో తోసేసి అనంతరం ఆమె కూడా అందులో దూకి మృతి చెందినట్లు తెలిపారు. అయితే ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయిన తర్వాత 10 గంటల సమయంలో వారి తల్లి అనుమానంతో గాలివీడుకు చేరుకుని నాగరాణి ఇంటి నుంచి వెళ్లిపోయిన విషయం స్థానిక పోలీసులకు తెలిపింది. అనంతరం పోలీసులు, వారి కుటుంబ సభ్యులు వెలిగల్లు ప్రాజెక్టు, పాపాఘ్ని నది, గండిమడుగు, తదితర పరిసరాలను గాలించగా గండిమడుగు ఒడ్డున సెల్‌ఫోను, పిల్లల చెప్పులు ఉండడంతో వారు మడుగులోకి లైట్లు ద్వారా చూడగా ఇద్దరు పిల్లలు నవ్య, దినేశ్ నీటిలో తేలియాడుతూ కనిపించగా వారిని బయటకు తీశారు. అనంతరం సమీపంలోని జాలర్లను పిలిపించి నాగరాణి, జాన్వి మృతదేహాలను వెలికి తీసినట్లు తెలిపారు. వెలికితీసిన నాలుగు మృతదేహాలను పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపారు.

జరిగిన సంఘటనపై మృతురాలి తల్లి రవణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతురాలి భర్త విక్రమ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఒకే కుటుంబంలో నలుగురు మృతి చెందడంతో మండల కేంద్రంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి.

పొలం అమ్మేసిన మాజీ సీఎం కిరణ్

● శంకర్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్

శంకర్‌పల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి శనివారం రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. జన్వాడలో ఆయనకు 1.20 ఎకరాల భూమి ఉండగా దానిని అమ్మేశారు.

ఆ భూమిని కొనుగోలుదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేసేందుకు ఆయన తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. అనంతరం హైదరాబాద్ వెళ్లిపోయారు. కాగా, మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి కార్యాలయానికి వచ్చిన విషయం తెలుసుకున్న చాలా మంది స్థానికులు, పలువురు నాయకులు కార్యాలయానికి వచ్చి ఆయనతో ఫొటోలు దిగారు.

తంబళ్లపల్లె ఘటనలో ముగ్గురు టీడీపీ నేతలపై కేసు నమోదు

తంబళ్లపల్లె, ఏప్రిల్ 20: తంబళ్లపల్లె నామినేషన్ కేంద్రం వద్ద శుక్రవారం చోటు చేసుకున్న ఘటనలో విధుల్లో ఉన్న పోలీసులపై రాళ్లు రువ్వి గాయపరచి ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించారని ముగ్గురు టీడీపీ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. తంబళ్లపల్లె టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దాసరిపల్లె జయచంద్రారెడ్డి తంబళ్లపల్లె రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో శుక్రవారం నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో వచ్చారు. నామినేషన్ వేసేందుకు జయచంద్రారెడ్డి పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను దాటుకుని ముందుకు వచ్చారు. ఆయన వెంట వచ్చిన టీడీపీ శ్రేణులు కూడా ముందుకు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, టీడీపీ శ్రేణుల మధ్య తోపులాట జరగ్గా..ఈ సమయంలో అక్కడే ఉన్న గుర్తు తెలియని వ్యక్తులు పోలీసులపై రాళ్లు రువ్వారు. ఈ ఘటనలో ట్రైనీ డీఎస్పీ ప్రశాంత్ నుదుటికి గాయమైంది. దీంతో పోలీసులు టీడీపీ శ్రేణులపై లాఠీచార్జి చేయడంతో కొంతసేపు పరిస్థితి అదుపు తప్పింది. ఈ ఘటనకు సంబంధించి ములకలచెరువు ఎస్ఐ తిప్పేస్వామి తంబళ్లపల్లె ఎస్ఐ శివకుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఘటనకు సంబంధించిన వీడియో ఫుటేజ్‌లు పరిశీలించిన పోలీసులు రాళ్లు రువ్వి, విధులకు ఆటంకం కలిగించారని ముగ్గురు టీడీపీ నాయకులను గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. పెద్దమండ్యం మండలం దిగువపల్లెకు చెందిన ప్రతాప్‌నాయుడు, బి.కొత్తకోట మండలం రెడ్డివారిపల్లెకు చెందిన ఆనంద్‌పై కేసు నమోదు చేయగా మరొకరి ఆచూకీ లభ్యం కాలేదన్నారు. గుర్తించిన ఇరువురిని అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు తెలిపారు. వీడియో ఫుటేజ్ క్షుణ్ణంగా పరిశీలించి ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

దొరకునా ఇటువంటి సేవ..



● హనుమంత వాహనంపై కోదండరాముడి విహారం
● వైభవంగా ఒంటిమిట్ట రామయ్య బ్రహ్మోత్సవాలు
● శ్రీవారి లడ్డూ, ముత్యాల తలంబ్రాలు సిద్ధం

ఒంటిమిట్ట, ఏప్రిల్ 20 : ఆంధ్ర అయోధ్యగా పేరుగాంచిన ఒంటిమిట్ట కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాల్గవరోజు శనివారం రాత్రి విశేషమైన హనుమంత వాహన సేవ వైభవంగా నిర్వహించారు. సీతారామలక్ష్మణులు ప్రియభక్తుడైన హనుమంత వాహనాన్ని అధిరోహించి పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి కేరళ డ్రమ్స్, భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామి వారిని కీర్తిస్తుండగా మంగళవాయిద్యాల నడుమ వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు. త్రేతాయుగంలో రామభక్తునిగా, భగవద్గీత భక్తులలో అగ్రగణ్యుడుగా ప్రసిద్ధిగాంచిన హనుమంతుడు.. రాముడు భక్తాగ్రగణ్యుడైన హనుమకు ఆత్మతత్వాన్ని బోధించినట్లు ప్రాచీన వాఙ్మయం ద్వారా తెలుస్తోంది. దాసభక్తికి ప్రతీకగా స్వామివారు హనుమంత వాహనంపై ఊరేగుతున్నారు. వాహనం పొడవునా భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

నవనీత కృష్ణాలంకారంలో..

శనివారం ఉదయం నవనీత కృష్ణాలంకారంలో రాములవారు ముగ్ధమనోహరంగా దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారి ఊరేగింపు వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామి వారిని కీర్తిస్తుండగా మంగళవాయిద్యాల నడుమ స్వామి వారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు. పురాణాల ప్రకారం కృష్ణుడు వెన్నదొంగ.. రేపల్లిలో బాలకృష్ణుడు యశోదమ్మ ఇంట్లోనే కాక అందరి ఇళ్లలోకి వెళ్లి వెన్న ఆరగించేవారు. ఈ చిన్నికృష్ణుడి లీలలను గుర్తు చేస్తూ రాములవారు వెన్నకుండతో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్ పాల్గొన్నారు.


శాస్త్రోక్తంగా ఊంజల్ సేవ

శనివారం సాయంత్రం రామాలయంలోని మండపంలో శాస్త్రోక్తంగా ఊంజల్ సేవను నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ఉయ్యాలలో ముందుగా ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ఉయ్యాలలో ఉంచి వైష్ణవ సంప్రదాయంలో వేద మంత్రాల మధ్య ఊంజల్ సేవను నిర్వహించారు.


హనుమంత వాహనంపై విరాజిల్లుతున్న సీతారాములు

శ్రీవారి లడ్డూ, ముత్యాల తలంబ్రాలు సిద్ధం

సీతారాముల కల్యాణానికి వచ్చే భక్తులకు అందించేందుకు తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం, ముత్యాల తలంబ్రాలు టీటీడీ అధికారులు సిద్ధం చేశారు. దాదాపు 300 మంది శ్రీవారి సేవకులు లడ్డూలు (రెండు), కంకణాలు (రెండు), తలంబ్రాలు (ముత్యం)తో పాటు పవిత్రమైన అక్షింతలను ఒక ప్యాక్‌లో వేసి సీతారాముల కల్యాణంలో పాల్గొనే భక్తులకు పంపిణీ చేయడానికి ప్రసాదం కిట్‌లను సిద్ధం చేశారు. డిప్యూటీ ఈవో ప్రశాంతి ఆధ్వర్యంలో తలంబ్రాలను, లడ్డూలను ప్యాకింగ్ చేపట్టారు.

విద్యుత్ దీపకాంతులలో ఒంటిమిట్ట కోదండరామాలయం



నవనీతకృష్ణాలంకారంలో స్వామి వారి విహారం




అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



రాష్ట్రానికే వన్నె.. బండారు రత్నసభాపతి



1973లో నాటి సీఎం జలగం వెంగళ్రావు రాజంపేటకు వచ్చిన సందర్భంగా అప్పటి ఎమ్మెల్యే బండారు రత్నసభాపతి

రాజంపేట, ఏప్రిల్ 20: రాష్ట్రంలో.. ఉమ్మడి కడప జిల్లాలోని రాజకీయాల్లో ఎప్పుడూ గుర్తుండిపోయే ఆదర్శ మహానేత, సోషలిస్ట్ ఉద్యమ నేత, మాజీ మంత్రి బండారు రత్నసభాపతి. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి తరానికంటే ముందు జిల్లా రాజకీయాల్లో ఆయన ఆదర్శ మార్క్.. తెలియనివారుండరు. ఆ నాడు ఆయన అసెంబ్లీకి వెళితే అటు పాలకపక్షంలో వణుకుపుట్టేది. ఆయన ఆదర్శాలు నేటికీ చిరస్మరణీయమే. నాటి అసెంబ్లీ సింహంలా గుర్తింపు పొందిన రాజంపేట రాజకీయ దురంధరుడు. ఆయన నేడు మన మధ్య లేకపోయినా జిల్లాలో రాజంపేటకు ఆల్విన్ కర్మాగారాన్ని తెప్పించిన గొప్ప నేత. కులమతాలకు అతీతంగా సోషలిస్ట్ భావాలను పుణికిపుచ్చుకొని బడుగు, బలహీన వర్గాలను ఆదరించిన గొప్పనాయకుడు. ఆ నాడూ ఆయన కులాలను దగ్గరకు రానివ్వలేదు. పేదరికమే తన కులమని భావించి అనేకమందికి ఉన్నత పదవులను రాజకీయంగా కల్పించారు. అనేక కీలక పదవులు అనుభవించి జిల్లా రాజకీయ ఆణిముత్యంలా గుర్తింపు పొందారు. ఆయన మూడు సార్లు ఎమ్మెల్యేగా, రాష్ట్ర డీసీసీ బ్యాంకు ఛైర్మన్‌గా, బద్వేలు, రాజంపేట ఎమ్మెల్యేగా, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ మంత్రిగా ఎంతో గుర్తింపు పొందారు. అటువంటి నాయకుడు 1973వ సంవత్సరంలో తాను ఎమ్మెల్యేగా ఉండగా సోషలిస్ట్ భావాలను ఆచరించే అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళ్రావును రాజంపేటకు తీసుకువచ్చి అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగానే నేటి అన్నమయ్య ప్రాజెక్టుకు ఆ నాడే అంకురార్పణ చేశారు. ఆ సందర్భంగా సుమారు 46 సంవత్సరాల కిందట ఆ నాడు తీసిన బ్లాక్ అండ్ వైట్ ఫోటో ఆంధ్రజ్యోతి మీ ముందుంచుతోంది.


ప్యాకేజీ ఇచ్చుకో... మద్దతు పుచ్చుకో...



రాజంపేట, ఏప్రిల్ 20: ఇప్పుడు రాజంపేట ప్రాంతంలో ఏ నోట చూసినా ప్యాకేజీ మాటే.. ఒక స్థాయి నాయకుడిని తనవైపుకు తిప్పుకోవాలంటే ప్యాకేజీ ఇచ్చుకోవాల్సిన పరిస్థితి. అంగబలం కలిగి సామాజికపరంగా ఓటుబ్యాంక్ కలిగిన నేతలను పలు దఫాలుగా సంప్రదించి తమవైపుకు తిప్పుకోవాలంటే నేతలకు చాలా కష్టంగా ఉంది. అందువల్ల ఏమీ చేయలేక వారికి అంతో ఇంతో ముట్టచెప్పడానికి ప్రధాన పార్టీ అభ్యర్థులు సిద్ధమైనట్లు సమాచారం. ఈ ప్యాకేజీలు కోట్లల్లో సాగుతున్నాయి. ఇటీవల ఒక మండల నాయకుడిని.. టికెట్టు దక్కించుకున్న ఓ నేత వెళ్లి మద్దతు కావాలని కోరారు. ఇందుకు ఆ నేత 'ఎందుకు నీకు మద్దతు ఇవ్వాలి.. వ్రతం చెడినా.. సుఖం దక్కాలి కదా.. నీకు మద్దతు ఇవ్వాలంటే నాకు వచ్చే ప్రయోజనమేంది..? పదవులు ఎట్లా ఇవ్వలేవ్.. నాకు పెద్దఎత్తున పైసలిస్తే నేను నిక్కచ్చిగా పనిచేసి నీకు మద్దతిస్తా... నీకు రాజకీయంగా బలం చేకూరుతుంది' అని చెప్పారు. ఈ విధంగా 50 శాతం మంది ప్యాకేజీ పైసలకే పడిపోతున్నారు. ఇందులో కొన్ని ప్యాకేజీలు కూడా ఓకే చేసి అనేక మందిని ఓ ప్రధాన పార్టీ తమవైపుకు తిప్పుకుంది. ఫలానా మండలంలో ఫలానా ఊర్లో ఓ కులనాయకుడు, ఓ పెద్దనాయకుడిని తమ వైపుకు తిప్పుకోవాలంటే ఎలా.. అని ప్రశ్న వచ్చినప్పుడు ఇక వెంటనే పుట్టుకొచ్చేది ప్యాకేజీ.. ఇందులో అనధికారికంగా తమకు అందుతున్న సమాచారం.. గల్లీ నేత అయితే ఒక రేటు.. గ్రామ నేత అయితే మరోరేటు... మండల నేత అయితే ఇంకో రేటు.. ఇది లక్షల్లోనే సాగుతుంది. రూ.లక్ష నుంచి అరకోటి వరకు ఈ ప్యాకేజీలు సాగుతున్నాయన్నది జోరుగా ప్రచారముంది. ఇక నియోజకవర్గంలోని ఒక మోస్తారు టికెట్టు వరకు వచ్చిన నేతలకైతే ఇది కోట్లలోనే సాగుతున్నట్లు సమాచారం. నేటి ప్రజాస్వామ్య వ్యవస్థలో డబ్బు లేనిదే రాజకీయం లేదు. పైసలు లేనిదే పదవులు లేవు. ఇక పోటీ చేసే వారికైతే ఇది కోట్లల్లో సాగేతంతు అన్నది జగమెరిగిన సత్యం. ఇందులో భాగంగానే ఈ ప్యాకేజీ వ్యవహారం ఒక మోస్తరు నుంచి భారీగా జరగడం ఒక జూదాన్ని తలపిస్తుంది.

వరుసగా రెండోసారి.. ఇద్దరే...

● మదనపల్లెలో ఇద్దరే రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నిక



ఆలూరి నరసింగరావు




రాటకొండ నారాయణరెడ్డి

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 20: మదనపల్లె నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వ్యక్తులుగా ఇద్దరే నిలిచారు. వారే ఆలూరి నరసింగరావు, రాటకొండ నారాయణరెడ్డి. ఇప్పటి వరకు మదనపల్లె అసెంబ్లీకి 15 సార్లు ఎన్నికలు జరిగినా కేవలం ఆలూరి నరసింగరావు, నారాయణరెడ్డికి మాత్రమే వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యే అయ్యే అవకాశం దక్కింది. తరువాత జరిగిన ఎన్నికల్లో వరుసగా టికెట్లు రాక కొందరు, నియోజకవర్గ డీలిమిటేషన్ కారణంగా మరికొందరు రెండోసారి ఎన్నికయ్యే అవకాశాలు కోల్పోయారు. మద్రాస్ రాష్ట్రంలో ఉన్నప్పుడు 1952లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మదనపల్లె ఎమ్మెల్యేగా కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా దొడ్డా సీతారామయ్య గెలిచారు. తరువాత ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో 1957 సంవత్సరంలో ఐఎన్‌సీ తరపున టి.గోపాలక్రిష్ణయ్య గుప్తా ఎమ్మెల్యేగా గెలిచారు. ఆంధ్రప్రదేశ్‌గా అవతరణ చెందాక 1962లో నిర్వహించిన ఎన్నికల్లో దొడ్డా సీతారామయ్య ఐఎన్‌సీ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచారు. 1967లో ఆలూరి నరసింగరావు, 1972లో కూడా వరుసగా ఐఎన్‌సీ తరపున ఆలూరి నరసింగరావు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అనంతరం 1978 సంవత్సరంలో ఐఎన్‌సీ అభ్యర్థి గంగారపు వెంకటనారాయణరెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1983 సంవత్సరంలో ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీ తరపున రాటకొండ నారాయణరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు. అప్పట్లో రాజకీయ సంక్షోభంతో 1985లో నిర్వహించిన ఉప ఎన్నికల్లో తిరిగి రాటకొండ నారాయణరెడ్డే టీడీపీ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీని తరువాత 39 ఏళ్లుగా ఏ ఒక్కరు కూడా రెండోసారి వరుస ఎమ్మెల్యేగా గెలుపొందలేకపోయారు. 1989లో ఐఎన్‌సీ అభ్యర్థిగా ఆవుల మోహన్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు. 1994లో రాటకొండ కృష్ణసాగర్‌రెడ్డి, 1999లో రాటకొండ శోభ, 2004లో దొమ్మలపాటి రమేశ్ టీడీపీ అభ్యర్థులుగా నిలబడి విజయం సాధించారు. 2009లో ఐఎన్‌సీ అభ్యర్థి ఎం.షాజహాన్‌బాషా ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో డాక్టర్ దేశాయ్‌తిప్పారెడ్డి వైసీపీ తరఫున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019లో వైసీపీ అభ్యర్థి ఎం.నవాజ్‌బాషా ఎమ్మెల్యేగా గెలిచారు. కాగా 2024 ఎన్నికల్లో ఎవ్వరు గెలిచినా వరుసగా రెండోసారి ఎమ్మెల్యే చాన్స్ లేదు. వైసీపీ తరపున సిట్టింగ్ ఎమ్మెల్యే నవాజ్‌బాషా స్థానంలో నిస్సార్‌అహ్మద్ పోటీ చేస్తుండగా టీడీపీ తరపున మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా పోటీ చేస్తున్నారు.

పెద్ద రెడ్ల మధ్య పోటాపోటీ...

- నల్లారికి, పెద్దిరెడ్డిలకు సవాలుగా రాజంపేట ఎంపీ ఎన్నికలు
- ఎక్కువసార్లు ఇక్కడ బలిజ సామాజిక వర్గానిదే పైచేయి
- ప్రస్తుత ఎన్నికల్లో రెడ్ల మధ్యే ఢీ అంటే ఢీ...
- ఇటు చిత్తూరు, ఉమ్మడి కడప జిల్లాల్లోని నియోజకవర్గాల్లో ఈ పార్లమెంటులో ప్రాతినిధ్యం
- రాజంపేట పార్లమెంటుపై సింహావలోకం



రాజంపేట, ఏప్రిల్ 20: రాజంపేట పార్లమెంట్ ఎన్నికలు పెద్ద రెడ్ల మధ్యే పోటాపోటీగా జరగనున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలోనే పేరు గాంచిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి, నేటి బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డికి, ప్రస్తుత సిట్టింగ్ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి రాజకీయ ప్రతిష్టతకు సవాలుగా నిలుస్తున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉంటూ రాష్ట్ర విభజన తరువాత రాష్ట్ర రాజకీయాలకు దూరమైన నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఈ ఎన్నికల్లో అనూహ్యంగా బీజేపీ తరఫున ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయడం ఆసక్తిగా మారింది. అదే సమయంలో ఇప్పటికే రెండుసార్లు వరుసగా ఎంపీగా గెలుపొందిన పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి హ్యాట్రిక్ కొడతారా.. నల్లారి చేతిలో ఓటమి చెందుతారా అన్నది ప్రశ్నార్థకంగా ఉంది. ప్రస్తుతం ఊహించని రాజకీయ పరిణామాల మధ్య బీజేపీ, టీడీపీ, జనసేన ఒక కూటమిగా మారాయి. ఆ కూటమి ఎంపీ అభ్యర్థిగా నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. అందువల్ల కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపు కోసం టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, అటు బీజేపీ నాయకులు, ఇటు జనసేన పార్టీ నాయకులు ముగ్గురూ ఉమ్మడిగా కృషి చేస్తున్నారు. పెద్దిరెడ్డి కుటుంబాన్ని కొట్టగలిగే సత్తా నల్లారి కుటుంబానికి ఉందని అనాదిగా ఈ రెండు కుటుంబాలు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తమ రాజకీయ ఆధిపత్యాన్ని చలాయిస్తున్నాయని అందువల్లే తిరిగి పార్టీలు టికెట్లు కేటాయించడంతో పోటీ రసకందాయంలో పడింది. ప్రధానంగా ఈ పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో ముస్లిం మైనారిటీ ఓట్లు ఏ విధంగా మలుపు తిరుగుతాయో అన్న దానిపై గెలుపోటములు ఆధారపడి ఉన్నాయి. అయితే ఇరువురి మధ్య పోటీ ఆసక్తిగా మారి రాష్ట్ర రాజకీయాల్లో ఈ నియోజకవర్గ పార్లమెంటు ఎన్నికలు రసవత్తరంగా మారాయి. గత పార్లమెంటు ఎన్నికలను ఒకసారి సింహావలోకనం చేసుకుంటే... అన్నమయ్య జిల్లాగా ఏర్పడిన ఈ పార్లమెంటు పరిధిలో ఆరు నియోజకవర్గాలు, చిత్తూరు జిల్లాలోని పుంగనూరు నియోజకవర్గం కలిపి మొత్తం ఏడు నియోజకవర్గాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాతో ఆలోచన చేస్తే చిత్తూరులోని నాలుగు నియోజకవర్గాలు, కడపలోని మూడు నియోజకవర్గాలు ఇక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ఎక్కువ నియోజకవర్గాలు చిత్తూరు జిల్లా పరిధిలోకి రావడం వల్ల అక్కడ అభ్యర్థులకే ప్రాధాన్యత నిస్తూ ఇరువురిని పోటీలోకి దించారు. నియోజకవర్గాల పునర్విభజనకు ముందు కడప జిల్లా నుంచి నాలుగు నియోజకవర్గాలు, చిత్తూరు జిల్లా నుంచి మూడు నియోజకవర్గాలు ఉండటం వల్ల ఎక్కువగా కడప జిల్లాకు సంబంధించిన వారినే ఎంపీ అభ్యర్థులుగా పోటీకి నిలబెట్టేవారు. ప్రస్తుతం నియోజకవర్గాల పునర్విభజన తరువాత చిత్తూరు జిల్లాలో నాలుగు నియోజకవర్గాలు, కడప జిల్లాలో లక్కిరెడ్డిపల్లెను రద్దు చేసి మూడు నియోజకవర్గాలు చేయడం వల్ల పరిస్థితి తారుమారైంది. ఏదిఏమైనా ఈ రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం రెండు జిల్లాల్లో ఉండటం, కడప జిల్లాలోని రాజంపేట, రైల్వేకోడూరు ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గం, రాయచోటి ఈ పార్లమెంట్ పరిధిలోకి వస్తాయి. చిత్తూరు జిల్లాలోని తంబళ్లపల్లె, పీలేరు, మదనపల్లె, పుంగనూరు చిత్తూరు జిల్లా పరిధిలోకి వస్తాయి.

రాజంపేట పార్లమెంట్ వ్యవహారాన్ని పరిశీలిస్తే... 1957లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థిగా టి.ఎన్.విశ్వనాధరెడ్డి, 1962లో సి.ఎల్.నరసింహారెడ్డి, 1967, 71, 77, 80 ఎన్నికల్లో వరుసగా నాలుగుసార్లు పోతురాజు పార్థసారధి కాంగ్రెస్ పార్టీ తరపున ఎన్నికయ్యారు. 1984లో టీడీపీకి చెందిన సుగవాసి పాలకొండ్రాయుడు గెలుపొందారు. అనంతరం 1991, 96, 98, 99 ఎన్నికల్లో వరుసగా నాలుగు సార్లు సాయిప్రతాప్ కాంగ్రెస్ పార్టీ తరపున గెలుపొంది రికార్డు సృష్టించారు. 1990లో గునిపాటి రామయ్య టీడీపీ తరపున గెలుపొందారు. 2004, 09ల్లో వరుస ఎన్నికల్లో తిరిగి కాంగ్రెస్ తరపున సాయిప్రతాప్ రెండుసార్లు గెలుపొందారు. మొత్తం ఆయన ఆరుసార్లు ఎంపీగా గెలుపొంది కొత్త చరిత్ర సృష్టించారు. 2014 ఎన్నికల్లో వైసీపీ తరపున పి.వి.మిధున్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సమయంలో బీజేపీ తరఫున పురందేశ్వరి పోటీ చేయగా ఆమెకు 4,26,990 ఓట్లు రాగా మిధున్‌రెడ్డి 6,01,752 ఓట్లు దక్కగా మిధున్‌రెడ్డి గెలుపొందారు. తిరిగి 2019 ఎన్నికల్లో మిధున్‌రెడ్డి టీడీపీ అభ్యర్థి డి.కె.సత్యప్రభపై గెలుపొందారు. మిధున్‌రెడ్డికి 7,02,211 ఓట్లు రాగా సత్యప్రభకు 4,33,927 ఓట్లు దక్కాయి. మూడోసారి మిధున్‌రెడ్డి తిరిగి పోటీ చేస్తున్నారు. ఆది నుంచి ఈ స్థానంలో బలిజ సామాజిక వర్గానికి సంబంధించిన వ్యక్తులే ఎక్కువసార్లు ఎన్నికయ్యారు. 1962, 2014, 2019 ఎన్నికల్లో మాత్రం రెడ్ల సామాజిక వర్గానికి సంబంధించిన అభ్యర్థులు ఎన్నికయ్యారు. మిగిలిన అన్ని ఎన్నికల్లోనూ బలిజ సామాజికవర్గమే కీలకపాత్ర పోషిస్తోంది. ఈ పార్లమెంట్ నియోజకవర్గంలో బలిజలు ఎక్కువ శాతం ఉండటం, రెడ్డి సామాజిక వర్గం రాజకీయ ఆధిపత్యం ఉండటంతో వారి మధ్యనే పోటీ సాగుతోంది. తెలుగుదేశం పార్టీ ఒకసారి మినహా మిగిలిన అన్ని ఎన్నికల్లోనూ బలిజ అభ్యర్థులనే పోటీకి దింపింది. కాంగ్రెస్ పార్టీ ఇదే పద్ధతిని అవలంబించింది. కానీ వైసీపీ ఆవిర్భావం తరువాత పరిస్థితి మారింది. మిధున్‌రెడ్డి గత 2014, 2019 ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలుపొందారు. ప్రస్తుతం పోటీ చేస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, వైసీపీ తరపున పోటీ చేస్తున్న మిధున్‌రెడ్డి ఇరువురు అభ్యర్థులు చిత్తూరు జిల్లాకు సంబంధించిన వారు అయి ఉండటం వల్ల ఎక్కువగా ఆ జిల్లా రాజకీయాలు ఈ పార్లమెంట్‌పై ప్రభావం చూపుతున్నాయి.

రాజంపేట పార్లమెంటు ఓటర్లు	
మొత్తం ఓటర్లు	: 16,39,605
నియోజకవర్గాలు	: 7
అన్నమయ్య జిల్లాలో	: 6
చిత్తూరు జిల్లాలో	: 1

నియోజకవర్గాల వారిగా ఓటర్లు	
పుంగనూరు	: 2,38,236
పీలేరు	: 2,32,631
కోడూరు (ఎస్సీ)	: 2,01,114
రాయచోటి	: 2,49,315
రాజంపేట	: 2,37,112
తంబళ్లపల్లె	: 2,21,146
మదనపల్లె	: 2,60,009

రాజంపేట పార్లమెంట్ అభ్యర్థులు

సం..	గెలుపొందిన అభ్యర్థి	పార్టీ
1957	టి.ఎన్.విశ్వనాథరెడ్డి	కాంగ్రెస్
1962	సి.ఎల్.నరసింహారెడ్డి	స్వతంత్ర్య
1967	పోతురాజు పార్థసారధి	కాంగ్రెస్
1971	పోతురాజు పార్థసారధి	కాంగ్రెస్
1977	పోతురాజు పార్థసారధి	కాంగ్రెస్
1980	పోతురాజు పార్థసారధి	కాంగ్రెస్
1984	ఎస్.పాలకొండ్రాయుడు	టీడీపీ
1989	ఎ.సాయిప్రతాప్	కాంగ్రెస్
1991	ఎ.సాయిప్రతాప్	కాంగ్రెస్
1996	ఎ.సాయిప్రతాప్	కాంగ్రెస్
1998	ఎ.సాయిప్రతాప్	కాంగ్రెస్
1999	జి.రామయ్య	టీడీపీ
2004	ఎ.సాయిప్రతాప్	కాంగ్రెస్
2009	ఎ.సాయిప్రతాప్	కాంగ్రెస్
2014	పి.వి.మిధున్‌రెడ్డి	వైసీపీ
2019	పి.వి.మిధున్‌రెడ్డి	వైసీపీ



పి.పార్థసారధి



ఎ.సాయిప్రతాప్



పి.వి.మిథున్‌రెడ్డి



నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి

దీని మర్మమేమిటి చెప్మా....?!

● ఒకే రోజు నలుగురు స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్

● నలుగురూ వాల్మీకిపురం వాసులే



పీలేరు, ఏప్రిల్ 20: ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా నలుగురు. వీరందరూ వాల్మీకిపురం వాసులే. స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ వేశారు. దాని వెనుకున్న అంతరార్థం ఏమిటో అర్థం కాక అటు అధికారులు, ఇటు ప్రజలు చెవులు కొరుక్కుంటున్నారు. వాల్మీకిపురం పట్టణానికి చెందిన వై.మహేశ్‌రెడ్డి, కె.బ్రహ్మయ్య ఆచారి, పలవలి రామకృష్ణారెడ్డి, కె.చిన్న రెడ్డప్పరెడ్డి శనివారం పీలేరు అసెంబ్లీ నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేశారు. వారు తమ నామినేషన్ పత్రాలను పీలేరు ఆర్‌వో జేసీ ఫర్మాన్ అహ్మద్‌కు అందజేశారు. అయితే ఒకే ఊరికి చెందిన నలుగురు వ్యక్తులు ఒకేరోజు స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేయడం చర్చనీయాంశ మైంది. వీరంతా వైసీపీ మద్దతుదారులేనని, ఎన్నికలు, ఆ తరువాత జరిగే లెక్కింపు కార్యక్రమంలో సహాయకారిగా ఉండేందుకు, తమకు లెక్కకు మిక్కిలి ఏజెంట్లు సమకూర్చుకునేందుకు వైసీపీ నాయకులే వీరి దగ్గర స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేయించారని లోకల్ టాక్. అయితే వీరు చివరి దాకా బరిలో ఉంటారో, లేక మధ్యలో డ్రాప్ అవుతారో వేచి చూడాలి.

అనుమతి లేకుండా జగన్ సిద్ధం బ్యానర్

● ఆర్డీవో ఆదేశాలతో తొలగించిన ఎంసీసీ అధికారులు

మదనపల్లెటౌన్, ఏప్రిల్ 20: మదనపల్లె మండలం సీటీఎం క్రాస్‌రోడ్డులో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన వైసీపీ అధ్యక్షుడు జగన్ బొమ్మతో వున్న సిద్ధం బ్యానర్‌ను ఎంసీసీ అధికారులు తొలగించారు. ఇటీవల మదనపల్లె పట్టణం, మండలంలో సిద్ధం బ్యానర్ల ఏర్పాటుకు వైసీపీ నాయకులు రాష్ట్ర ఎన్నికల కమిషన్ నుంచి అనుమతి తీసుకున్నారు. మదనపల్లె పట్టణంతో పాటు మండలంలో 12 చోట్ల సిద్ధం బ్యానర్ల ఏర్పాటుకు వైసీపీ నాయకులు అనుమతి తీసుకున్నారు. శనివారం రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హరిప్రసాద్‌కు అందిన ఫిర్యాదుతో ఆయన ఆదేశాల మేరకు ఎంపీడీవో, ఎంసీసీ అధికాలు సీటీఎం క్రాస్‌రోడ్డులో ఓ మిద్దెపై ఏర్పాటు చేసి సిద్ధం బ్యానర్‌ను తొలగించారు. ఎన్నికల నియమావళి ప్రకారం సిద్ధం బ్యానర్ ఏర్పాటు చేసిన వారికి జరిమానా విధిస్తామన్నారు.



సీటీఎం క్రాస్‌రోడ్డులో ఓ ఇంటిపై ఏర్పాటు చేసిన సిద్ధం బ్యానర్



సిద్ధం బ్యానర్ తొలగించిన తరువాత దృశ్యం

వైసీపీకి గుదిబండగా అలకపాన్పు

రాజంపేట, ఏప్రిల్ 20: రాజంపేట నియోజకవర్గంలో పెద్ద హాట్ టాపిక్‌గా ఉన్న రాజకీయ అంశం మేడా, ఆకేపాటి అన్నదమ్ముల అలకపాన్పు అంశం. వైసీపీలో ప్రధానమైన ఇరువురు నాయకులు జడ్పీ ఛైర్మన్, ప్రస్తుత ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మరో కీలక నాయకుడు ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి. ఈ ఇరువురు నాయకులకు ప్రధానమైన సోదరులు ఇరువురు ఉన్నారు. వీరి అంశం ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది. ఇది టీడీపీకి బాగా కలిసివచ్చే అంశం. ఇప్పటికే వైసీపీ ప్రధాన నాయకులంతా టీడీపీ తీర్థం పుచ్చుకోవడంతో ఈ అంశం ఎక్కడ చూసినా ప్రధాన అంశంగా మారింది.



ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

ముందుగా ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి విషయానికి వస్తే ఆయనకు ఎమ్మెల్యే టికెట్టు దక్కలేదు. ఆయన సోదరుడు క్లాస్‌వన్ కాంట్రాక్టర్ మేడా రఘునాధరెడ్డి.. ఈయనకు ఇటీవలే వైసీపీ రాజ్యసభ పదవిని కట్టబెట్టి మల్లికార్జునరెడ్డికి ఎమ్మెల్యే టికెట్టు ఇవ్వకుండా మొండి చేయి చూపింది. చేసేది లేక ఆయన తన తమ్ముడికి రాజ్యసభ స్థానం ఖరారయ్యే వరకు ఒకటి రెండు వైసీపీ సమావేశాల్లో పాల్గొని తూతూ మంత్రంగా సమావేశంలో ప్రసంగించారు. తన తమ్ముడికి రాజ్యసభ సభ్యునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన తరువాత ఆ పార్టీలోనే ఉంటూ తాను చేయాల్సిన పనిని చకచకా పూర్తి చేశారు. ముచ్చటగా మూడు సార్లు నియోజకవర్గంలోని ఆరు మండలాల ప్రధాన నాయకులను, సర్పంచ్‌లను, ఎంపీటీసీలను, కౌన్సిలర్లను తన మాజీ వర్గీయుడైన మాజీ మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ పోలి సుబ్బారెడ్డి నేతృత్వంలో టీడీపీలో చేర్పించి తన రాజకీయ ప్రత్యర్థి అయిన ఆకేపాటి అమర్‌నాథరెడ్డిపై, వైసీపీపై తన అక్కసును తీర్చుకున్నారు. ప్రస్తుతం మల్లికార్జునరెడ్డి వైసీపీ ప్రచార కార్యక్రమాలకు, అమర్‌నాథరెడ్డి నామినేషన్ కార్యక్రమానికి కూడా రాకుండా ఎంచక్కా తన వ్యాపార కార్యక్రమాలపై దృష్టి పెట్టారు. రాజ్యసభ సభ్యుడైన రఘునాథరెడ్డి తన అన్న మల్లికార్జునరెడ్డి నిర్వహిస్తున్న వ్యవహారాలను చూడడం తప్ప అడ్డగించుకోలేని పరిస్థితిలో ఉండిపోయారు.

అలకపాన్పుపై ఆకేపాటి మురళీ

ఇంకో ప్రధాన విషయం ఆకేపాటి అన్నదమ్ములది. ప్రస్తుతం ఆకేపాటి అమర్‌నాథరెడ్డి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఆయన ప్రస్తుతం జడ్పీ ఛైర్మన్ అన్న సంగతి అందరికీ తెలిసిందే. అయితే అమర్‌నాథరెడ్డి చిన్నాన్న ఆకేపాటి గోపాల్‌రెడ్డి కుమారుడైన శ్రీనివాసులరెడ్డి (మురళీ) అలక పాన్పుపై పార్టీ ప్రచార కార్యక్రమాలకు దూరంగా ఉండిపోయారు. నియోజకవర్గంలో ఆకేపాటి గోపాల్‌రెడ్డి అంటే తెలియని వారుండరు. ఆయన అమర్‌నాథరెడ్డికి స్వయాన చిన్నాన్న. గోపాల్‌రెడ్డి గతంలో టీడీపీ ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేయాల్సి ఉండగా కొన్ని అనివార్య కారణాల వల్ల కుదరలేదు. ఆయన మరణం తరువాత ఆయన కుమారుడు శ్రీనివాసులరెడ్డి, ఆకేపాటి రంగారెడ్డి (మండల ఉపాధ్యక్షుడు) రాజకీయం నిర్వహిస్తున్నారు. శ్రీనివాసులరెడ్డికి తమ తండ్రి హయాం నుంచి బలమైన అనుచరగణం ఉంది. రాజంపేట, సుండుపల్లి మండలాలతో పాటు ఆకేపాడు చుట్టుపక్కల ఏడు గ్రామాలపై వీరి ఆధిపత్యం నియోజకవర్గ రాజకీయాలను శాసిస్తోంది. ఒక దశలో శ్రీనివాసులరెడ్డికి టీడీపీ ఎమ్మెల్యే టికెట్టు లభిస్తుందని అందరూ అనుకున్నారు. ఇంతలో టికెట్టు సుగవాసి బాలసుబ్రమణ్యంకు దక్కింది. ఆ విషయం అటుంచితే... వైసీపీ ఐదేళ్ల హయాంలో తమకు ఎటువంటి సముచిత స్థానం ఇవ్వలేదని, అటు ఎమ్మెల్యే, ఎంపీలు తమకు ప్రాధాన్యత కల్పించలేదని, ఇత్యాది కారణాలతో తన అన్న అమర్‌నాథరెడ్డికి టికెట్టు ఇచ్చినా.. ఆయన వెంట తమ్ముడు శ్రీనివాసులరెడ్డి నడవలేదు. అదే సమయంలో ఆయన రాజంపేటలో ఉంటున్నా వైసీపీ నాయకులతో కలిసి ప్రచారాలకూ వెళ్లలేదు. ఈ సమయంలో ఇటీవల తన తండ్రి గోపాల్‌రెడ్డికి ప్రీతిపాత్రుడైన మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు, ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం అంతర్గతంగా మంతనాలు జరిపినట్లు సమాచారం. అవి ఏ మేరకు ఫలించాయనేది అటుంచితే శ్రీనివాసులరెడ్డి అలకపాన్పుపై ఉండటం వైసీపీకి శాపం కాగా, టీడీపీకి బాగా కలిసివచ్చే అంశమని పలువురు చర్చించుకుంటు న్నారు. కావున ప్రస్తుత తరుణంలో మేడా, ఇటు ఆకేపాటి అన్నదమ్ముల అలకపాన్పు అంశం నియోజకవర్గంలో పెద్ద హాట్ టాపిక్‌గా మారింది.



ఆకేపాటి శ్రీనివాసులరెడ్డి

ఎంతో ఖ్యాతిగాంచిన ఏపీఎస్ఆర్టీసీ సంస్థ. ప్రజారవాణా సంస్థగా గిన్నిస్‌బుక్‌లో స్థానం సంపాదించుకుంది. ఇంతటి ఖ్యాతి గాంచిన ఏపీఎస్ఆర్టీసీని ప్రభుత్వంలోకి విలీనం చేస్తామని దానిని ప్రజా రవాణా సంస్థగా పేరు మాత్రమే మార్చి ప్రగతి రథ చక్రాలకు జగన్‌మోహన్‌రెడ్డి కళ్లెం వేశారు. ఐదేళ్లలో ఆర్టీసిని ఎంత నిర్వీర్యం చేయాలో అంతా చేశారు. ప్రభుత్వంలో విలీనం చేస్తామని ప్రకటిస్తూ కొత్త బస్సుల కొనుగోలు మొదలు ఉద్యోగులకు అదనపు ప్రయోజనాలు కల్పిస్తామని నమ్మబలికి వారిని నిండామోసగించింది జగన్ ప్రభుత్వం. ఒక్క అవకాశం ఇస్తే నేనేంటో నిరూపిస్తాని ప్రతి పక్ష నేతగా ప్రగల్భాలు పలికి గంపగుత్తగా ఓట్లేయించుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి అన్ని వర్గాలకూ న్యాయం చేయలేక పోయారు. విలీనం అయ్యాక కార్మికులు కాదు ఉద్యోగులే అంటూ కార్మిక సంఘాలను సైతం అటకెక్కించారు. అబ్బురపరిచే డైలాగులు, అలవోకగా అబద్ధాలు చెప్పి ఆర్టీసీ ఉద్యోగులను నట్టేట ముంచారు. ముందే పసిగట్టిన వారు ఫలితం పొందారు. వివరాల్లోకెళితే....

కడప (మారుతీనగర్)



ఆర్టీసీ విలీనం - నిండామోసం

- విశ్వాసం కోల్పోయిన జగన్
- ఉద్యోగులకు అన్నింటా మోసమే
- నెత్తీ నోరు కొట్టుకుంటున్న వైనం

ఎంతో ఖ్యాతిగాంచిన ఏపీఎస్ఆర్టీసీ సంస్థ. ప్రజా రవాణా సంస్థగా గిన్నిస్‌బుక్‌లో స్థానం సంపాదించుకుంది. పగలూ... రాత్రి.. తేడా లేకుండా రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోల నుంచి వివిధ రకాల బస్సుల ద్వారా ప్రయాణీకులను వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరవేయడంలో ప్రసిద్ధిగాంచింది. ఏదేమైనా ప్రయాణీకులే ఆర్టీసీ మనుగడకు దేవుళ్ల అనే భావన ఆ సంస్థ కార్మికుల్లో (కండక్టర్స్- డ్రైవర్స్) గతంలో మెండుగా వుండేది. పైపెచ్చు ప్రయాణీకుడు చేయెత్తిన చోట బస్సు ఆపాలని, కోరిన చోటే నిలపాలని కూడా స్పష్టంగా ఆయా బస్సులకు రాతలుగా వుండేవి. కాలగమనంలో ఆర్టీసీ కార్మికుల్లో ఒక రకమైన ఆలోచన వారి మదిని తొలిచేది. అదేంటంటే ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని సౌకర్యాలు (పెన్షన్, తదితర బెనిఫిట్స్) అందుకోవాలనే ఆకాంక్ష బలంగా వుండేది. ఆ కాంక్షను పసిగట్టిన ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి గత ఎన్నికలకు ముందు జరిపిన మీ కోసం పాదయాత్రలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీకి గంపగుత్తగా ఆర్టీసీ కార్మికులు ఓట్లు వేసి గెలిపించారు. ఆ కోవలో 2020 జనవరి 1న ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినట్లుగా ప్రకటించారు. సరిగ్గా ఆ రోజు నుంచే ఆర్టీసీ కార్మికుల బతుకులు మారబోతున్నాయ ని అమాయక కార్మికులు కలలుగన్నారు. ఇక నుంచి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు, అలవెన్సులు, వస్తాయని, ఓల్డ్ పెన్షన్‌తో పాటు చిన్నదానికి, పెద్ద దానికి సస్పెండ్‌లుండవనే ఆశలపై నీళ్ళు చల్లారు. కొద్ది నెలల వరకు జగన్‌రెడ్డి నయవంచనకు గురౌతున్నామనే భావన వారిలో కానరాలేదు. రాను రాను పచ్చి మోసగాడి చేతిలో బలి పశువులం అయ్యామనే బాధ వారికి క్రమ క్రమంగా తెలియవచ్చింది. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమమే మా ధ్యేయం, మేమే ప్రభుత్వంలోకి విలీనం చేశాం అంటూ గొప్పలు చెప్పిన జగన్‌రెడ్డి ప్రభుత్వం కార్మికులకు అందాల్సిన ఆర్థిక ప్రయోజనాలకు తూట్లు పొడుస్తోంది. విలీనం కాక ముందు అందే అత్యధిక ప్రయోజనాలకు మంగళం పలికేలా పాలన సాగిస్తున్న తీరు పట్ల ఉద్యోగుల్లో జగన్‌రెడ్డిపై వున్న విశ్వాసం పూర్తిగా మంటగలిసిందని చెప్పవచ్చు.

అంతలా ఉద్యోగుల జీవితాలతో వైసీపీ ప్రభుత్వం చెలగాటం ఆడుతోంది.

ఆర్టీసీ ప్రభుత్వంలోకి విలీనానికి ముందు స్టాఫ్ రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ స్కీమ్ (ఎస్ఆర్‌బీఎస్) స్టాఫ్ రిటైర్మెంట్ బెనిఫిట్స్ ట్రస్ట్ (ఎస్ఆర్‌బీటీ) ద్వారా కార్మికులకు లబ్ధి చేకూరేది. ప్రస్తుతం ఉద్యోగులకు పెన్షన్ లేకుండా చేశారు.



కొంతమంది తెలివైన అధికారులు ఆర్థికంగా నష్టపోకుండా విలీనం కాకముందే (1-1-2020) వాలంటరీ రిటైర్మెంట్ (స్వచ్ఛంద విరమణ) చేసి గ్రాట్యుటీ అమౌంట్ అన్‌లిమిటెడ్ ఎంత వస్తే అంత మొత్తాన్ని అందుకున్నారు. ఆ లెక్కన ప్రభుత్వంలో రిటైర్మెంట్ అయితే ప్రస్తుతం రూ.12 నుంచి రూ.16 లక్షలు మాత్రమే అంద గలదు. దీన్ని ముందే పసిగట్టిన కడప జోన్ అధికారిగా విధులు నిర్వహించిన ఓ అధికారి విలీనం కాకముందే వాలంటరీ రిటైర్మెంట్ ఇచ్చేసి ఏకంగా ఆర్టీసీ నుంచి గ్రాడ్యుటీగా సుమారు రూ.56 లక్షలు అందుకోగలిగారు. ఇలా చాలా మంది అధికారులు తెలివిగా వాలంటరీ రిటైర్మెంట్ ఇచ్చినట్లు సమాచారం.

మెడికల్ పరంగా గట్టి దెబ్బ..

విలీనానికి ముందు ఏదేని కార్మికుడు అనారోగ్యానికి గురైతే కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించి పూర్తి స్థాయిలో ఆర్టీసీనే వైద్య ఖర్చులు భరించేది. కాగా ప్రస్తుతం ఆ స్థాయి వైద్యానికి తూట్లు పొడిసి ఒకే ఒక విభాగం (టీట్) పంటి విభాగానికి మాత్రమే కాసింత సాయం అందుతోంది. మిగతా ఏ విభాగం డాక్టర్స్ సేవలందించడం లేదు. ఇందుకు గాను ప్రతినెలా ఉద్యోగుల జీ తాల నుంచి రూ.250 మొదలు రూ.500 గుంజుతోంది. వైద్యసేవలకు హాస్పిటల్స్‌కు వెళ్లే ఉద్యోగులకు ముందస్తు పరీక్షలు, లాబరేటరీ ఫీజుల కింద వేలాది రూపాయలు ఖర్చుచేయాల్సిన దుస్థితి దాపురించింది.

మాయమైన మెడికల్ కార్డులు

విలీనానికి ముందు రిటైర్మెంట్ కాబడిన ఉద్యోగుల నుంచి రూ.25 వేలు కట్టించుకుని ఆర్టీసీ ద్వారా మెడికల్ కార్డులు ఇచ్చేది. విశ్రాంతి కాబడిన ఉద్యోగికి, ఆయన భార్యకు సంబంధిత ఆర్టీసీ ఏరియా హాస్పిటల్ ద్వారా ఏదేని అనారోగ్యసమస్యపై ఉచితంగా మందులు, ఇచ్చేది. మరింత అనారోగ్యానికి గురైతే ఏడాదికి సుమారు రూ.4 లక్షల మేరకు ఖర్చు భరించేది. ప్రస్తుతం ఈహెచ్‌సీ కార్డు ఇచ్చామనే వంకతో మెడికల్ కార్డులకు మంగళం పలికి వైద్యసేవలు నిలిపి వేశారు. అందజేసిన ఈహెచ్‌సీ కార్డు నాలుక గీసుకోడానికి కూడా పనికిరావడం లేదని ఆర్టీసీ ఉద్యోగులే బహిరంగంగా వాపోతున్నారు. అదే ప్రభుత్వ ఉద్యోగులు మాత్రం ఈహెచ్ఎస్ కార్డుల ద్వారా వైద్యసేవలు పొందుతున్నారు. పాపం ఆర్టీసీ ఉద్యోగులకు మాత్రం ఆ సేవలు అందకుండా చేశారు.

రాయితీ ప్రయాణం కట్

ఆర్టీసీలో సేవలందించి రిటైర్మెంట్ కాబడిన విశ్రాంత ఉద్యోగులకు విలీనానికి ముందు ఆ ఉద్యోగి, ఆయన భార్యకు కూడా ఏదేని బంధువుల ఇళ్ళకు, వివాహాలకు, ఆలయాల దర్శనకు వెళ్ళేందుకు వీలుగా 50 శాతం రాయితీతో గుర్తింపు కార్డులు అందజేసేది. విలీనం నాటి నుంచి వాటినీ కట్ చేశారు.

వైఎస్ కుటుంబం ఆధిపత్యం

45 ఏళ్లగా ఎంపీ, ఎమ్మెల్యేలుగా వారే... ● ఇదీ పులివెందుల నియోజకవర్గం



దివగంత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి



వైఎస్ వివేకానందరెడ్డి

పులివెందుల, ఏప్రిల్ 20: నాలుగున్నర దశాబ్ధాలుగా వైఎస్ కుటుంబం ఆధపత్యం కొనసాగుతోంది. అటు అసెంబ్లీకి, ఇటు పార్లమెంట్‌కు బరిలో నిలవాలన్నా వైఎస్ కుటుంబీకులే. ఇద్దరు ముఖ్యమంత్రులను అందించిన నియోజకవర్గంగా పులివెందుల వాసికెక్కింది. పులివెందుల నియోజకవర్గం 1955లో ఏర్పడగా మొట్ట మొదటి ఎమ్మెల్యేగా ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థిగా పెంచికల బసిరెడ్డి ఎన్నికయ్యారు. తర్వాత 1962లో స్వతంత్ర అభ్యర్థిగా చవ్వా బాలిరెడ్డి ఎన్నికయ్యారు. తర్వాత 1967, 1972లలో పెంచికల బసిరెడ్డి ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందారు. 1978 నుంచి వైఎస్ కుటుంబం ఆధిపత్యం చూపుతూ వస్తోంది. దీంతో పులివెందుల నియోజకవర్గం చరిత్రలో సుమారు ఐదు దశాబ్దాలు కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉండేది. వివరాల్లోకెళితే...

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 1978 నుంచి 2009 వరకు పులివెందులలో తిరుగులేని నేతగా ఎదిగారు. 1989 నుంచి కడప పార్లమెంట్ స్థానంలో ఆయన కుటుంబ సభ్యులే బరిలో నిలుస్తూ వచ్చారు. వైఎస్ అసెంబ్లీ నుంచి పోటీ చేస్తే ఆయన కుటుంబ సభ్యులు పార్లమెంటుకు పోటీ చేస్తూ వచ్చారు. ఇలా రెండిట్లోనూ ఆయన కుటుంబానిదే ఆధిపత్యం. 1978లో మొట్టమొదటిసారి అసెంబ్లీ ఎన్నికల్లో పులివెందుల అసెంబ్లీ నుంచి వైఎస్ఆర్ రెడ్డి కాంగ్రెస్ తరఫున బరిలో దిగారు. ఆయనకు ప్రత్యర్థిగా జనతాపార్టీ అభ్యర్థి బి.నారాయణరెడ్డి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో వైఎస్ విజయం సాధించారు. అనంతరం 1983లో ఇందిరా కాంగ్రెస్ అభ్యర్థిగా వైఎస్ బరిలో నిలాచారు. టీడీపీ అభ్యర్థిగా ఎద్దుల బాలిరెడ్డి, 1985లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా వైఎస్, టీడీపీ అభ్యర్థిగా డాక్టర్ సదాశివారెడ్డి, 1989లో కాంగ్రెస్ అభ్యర్థిగా వైఎస్ వివేకానందరెడ్డి, టీడీపీ అభ్యర్థిగా జ్యోతమ్మ బరిలో నిలిచారు. 1991లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా వైఎస్ పురుషోత్తమరెడ్డి, టీడీపీ అభ్యర్థిగా బాలస్వామిరెడ్డి బరిలో నిలిచారు. 1994లో కాంగ్రెస్ అభ్యర్థిగా వైఎస్ వివేకానందరెడ్డి, టీడీపీ అభ్యర్థిగా బాలస్వామిరెడ్డి బరిలో నిలిచారు. అనంతరం 1999, 2004, 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, టీడీపీ అభ్యర్థిగా సతీష్‌కుమార్‌రెడ్డి బరిలో నిలిచారు. 2009లో వైఎస్ మృతి అనంతరం ఉప ఎన్నికల్లో 2010లో వైఎస్ విజయమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2011లో వైఎస్ తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించారు. అపుడు వచ్చిన ఉప ఎన్నికల్లో వైఎస్ సతీమణి వైఎస్ విజయలక్ష్మి బరిలో నిలిచారు. కాంగ్రెస్ పార్టీ తరపున వైఎస్ వివేకానందరెడ్డి, టీడీపీ తరఫున బీటెక్ రవి పోటీలో నిలిచారు. ఈ పోటీలో వైఎస్ విజయమ్మ విజయం సాధించారు. అనంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైసీపీ పార్టీ పెట్టడం, 2014, 2019లో వైసీపీ తరపున బరిలో నిలిచారు. టీడీపీ తరఫున సతీష్‌కుమార్‌రెడ్డి బరిలో నిలిచారు. ఆ ఎన్నికల్లో వైఎస్ జగన్ గెలుపొందారు. కడప పార్లమెంట్ విషయానికొస్తే 1989 నుంచి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ వివేకానందరెడ్డి పలుమార్లు కడప పార్లమెంట్ బరిలో నిలిచి గెలుపొం దుతూ వచ్చారు. 2009లో వైఎస్ తనయుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కడప ఎంపీకి పోటీ చేసి ఎన్నికయ్యారు. 2011లో జగన్ సొంత పార్టీ స్థాపించిన అనం తరం ఆయన కడప పార్లమెం ట్ నుంచి ఉప ఎన్నికల్లో పోటీ చేశారు. టీడీపీ తర పున మైసూరారెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా డీఎల్ రవీంద్రా రెడ్డి బరిలో నిలిచారు. అపుడు కూడా వైఎస్ జగన్ ఎంపీగా గెలు పొందారు. అనంతరం 2014, 2019లో వైఎస్ అవినాశ్‌రెడ్డి కడప పార్లమెంట్ స్థానానికి పోటీ చేశారు. టీడీపీ అభ్యర్థిగా శ్రీనివాసరెడ్డి పోటీ చేశారు. ఇలా ప్రతి ఎన్నికల్లో వైఎస్ కుటుంబం ఆధిప త్యం కొనసాగిస్తూ వస్తోంది. ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం తీరు, ప్రజావ్యతిరేకత పెల్లుబికుతున్న తరుణం, కడప పార్లమెంట్ స్థానానికి వైఎస్ కుమార్తె వైఎస్ షర్మిలరెడ్డి కాంగ్రెస్ పార్టీ తరపున బరిలో దిగారు. మరోపక్క వైసీపీ అభ్యర్థిగా వైఎస్ అవినాశ్‌రెడ్డి బరిలో నిలిచారు. టీడీపీ ఉమ్మడి అభ్యర్థి భూపేష్ రెడ్డి బరిలో దిగారు. ఈ ఎన్నికల్లో వైఎస్ కుటుంబంలో ఒకరి ఓటమి అనివార్యం కాబోతోందని చెప్పాలి. వైఎస్ ఉన్నన్ని రోజులు ఓటమి ఎరుగని కుటుంబంగా రాజకీయాలను శాసిస్తూ వచ్చారు. 2011లో జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్ వివేకా నందరెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచి ఓటమిచెందారు. 2014ఎన్నికల్లో విశాఖపట్టణం నుంచి పార్లమెంట్ అభ్యర్థిగా వైఎస్ సతీ మణి విజయమ్మ బరిలో దిగి ఓటమి చెందారు. ఇప్పటికే ఆ కుటుంబంలో రెండు ఓటములు అనివార్యమైంది. ఏది ఏమైనా పులివెందుల, కడప స్థానాలకు వైఎస్ కుటుంబ సభ్యులే ఆధిపత్యం కొ న సా గి స్తు న్నారని చెప్పాలి.

నిబంధనలు ఉల్లంఘనపై

డిప్యూటీ సీఎం సోదరుడిపై కేసు నమోదు

కడప క్రైం, ఏప్రిల్20: కడప నగర చిలకల బావి వద్ద చిన్నపిల్లలతో ప్రచారం చేయించి ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన డిప్యూటీ సీఎం సోదరుడు ఎస్. అహ్మద్ బాషాపై కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈనెల 18వ తేదీ చిలకల బావివ ద్ద పిల్లలకు అధికార పార్టీ జెండాలు ఇచ్చి వారితో కలసి ఆప్రాంతంలో ప్రచారం నిర్వహించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించాడంటూ స్థానికుడు రవి టూటౌన్ పోలీసులకు ఫిర్యా దు చేయడంతో పోలీసులు ఎస్ఎం బాషాపై కేసు న మోదు చేశారు. ఈ విషయమై టూటౌన్ సీఐ ఇబ్రహీంను వివరణ కోరగా అహ్మద్ బాషాపై కేసు నమోదందన్నారు.

నిబంధనలు కొందరికేనా?

నిన్న అలా..నేడు ఇలా..



నామినేషన్ సందర్భంగా శుక్రవారం మందీమార్బలంతో వెళ్తున్న ఎంపీ అవినాశ్‌రెడ్డి

కడప, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిబంధనల అందరికీ ఒకేలా వర్తించేలా ఎన్నికల కమిషన్ రూపొందించింది. అయితే కొందరు స్థానిక అధికారులు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినా కూడా ఇంకా వైసీపీ సేవలోనే తరిస్తున్నారు. కొందరు పోలీసులు, మరికొందరు అధికారులు అధికార పార్టీ గెలుపు కోసమే పనిచేస్తున్నారనే విమర్శలున్నాయి. కడప వైసీపీ పార్లమెంట్ అభ్యర్థి అవినాష్‌రెడ్డి శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. అయితే ఆయన మందీ మార్బలంతో నామినేషన్ కార్యక్రమానికి వెళ్లడం ఎన్నికల నిబంధనలకు ఉల్లంఘించినట్లు స్పష్టంగా తెలస్తోంది. దండయాత్రలాగా కలెక్టరేట్‌లోకి అవినాష్ అడుగుపెట్టినా, నామినేషన్ వేసేందుకు ఎన్నికల అధికారుల వద్దకెళ్లినా పట్టించుకోలేదు. ఇక పీసీసీ చీఫ్ కాంగ్రెస్ పార్టీ తరపున శనివారం నామినేషన్ దాఖలు చేసింది. ఇపుడు మాత్రం పోలీసులకు ఎన్నికల నిబంధనలు గుర్తుకువచ్చాయి. నామినేషన్ వేసేందుకు షర్మిల, ఆమె సోదరి సునీత, పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డిని మాత్రమే అనుమతిచ్చారు. అయితే నిన్న అవినాష్‌రెడ్డితో ఉన్నవారిని అడ్డుకోకుండా షర్మిల వచ్చే సరికి ఎన్నికల నిబంధనలు గుర్తుకువచ్చాయి. ఎన్నికలు వచ్చిన మా వాళ్లకు బుద్ధి రాలేదబ్బ అని పోలీసులే సటైర్లు వేయడం కొసమెరుపు



శనివారం షర్మిల నామినేషన్‌కు నలుగురిని మాత్రమే అనుమతించిన పోలీసులు

నా సేవను పొందండి... : రోశన్న



ఎన్నికల ప్రచారంలో భాగంగా టీ అందిస్తున్న బొజ్జ రోశన్న

పోరుమామిళ్ల, ఏప్రిల్ 20: ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని.. నా సేవలు పొందండని బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థి బొజ్జ రోశన్న అభ్యర్థించారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ సమీప ప్రాంతాల్లో, శ్రీనివాస నగర్, చిన్నఎరసాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వైసీపీ అరాచక పాలనను సాగనంపాలని పిలుపునిచ్చారు. కూటమి ఎన్నికల మ్యానిఫెస్టోలోని పథకా లను వివరిస్తూ బీజేపీ తరపున పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు. ఈ ప్రచారంలో కార్యకర్తలు, నేతలను ఉత్తేజపరుస్తూ టీలు అందిస్తూ వినూత్న రీతిలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇదీ మన సంప్రదాయం

కుంకుమ బొట్టు పెట్టి...



ఇంటింటి ప్రచారం చేస్తున్న బీజేపీ నేతలు

ఖాజీపేట, ఏప్రిల్ 20: హిందూ సంప్రదాయం ప్రకారం ఇంటికి వచ్చి వెళ్లే మహిళలకు కుంకుమ బొట్టు పెట్టడం, కార్యక్రమాలకు ఆహ్వానించేందుకు వచ్చిన సమయంలో మహిళలకు బొట్టు పెట్టడం ఆనవాయితీ. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి మేజర్ పంచాయతీలోని బీసీ కాలనీ, బలిజవీధిలో ప్రచారం జోరుగా చేశారు. ఎన్డీయే కూటమి అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ భారీ మెజార్టీతో గెలువడం తధ్యమని, అరాచక పాలనను చూడలేక ప్రజలు విసుగు చెంది ఉన్నారని, వారి ఓటుతో బుద్ధి చెప్పాలని మహిళలకు బొట్టు పెట్టి మరీ అభ్యర్థించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు అజయ్‌కుమార్, ఎస్సీ మండల అధ్యక్షులు ఉదయ్, ప్రధాన కార్యదర్శి నరహరి, ముస్లిం నాయకులు జలీల్, హర్షద్, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయమైన అన్నక్యాంటిన్

పేదల అన్నంపై పగబట్టిన జగన్

- రూ. 5 లకే అన్నాక్యాంటిన్లలో భోజనం
- కక్ష పూరితంగా మూసివేత



ప్రొద్దుటూరు, ఏప్రిల్ 20: ఆకలి అన్న వారికి కడుపార అన్నంపెట్టడం మానవ ధర్మం. అలాంటి అన్నం అతి తక్కువ ధరతో రూ.5లకే పేదలకు అందించే అన్నా క్యాంటిన్లపై కక్షగట్టి వైసీపీ ప్రభుత్వం మూయించింది. పేదల ఆకలిపై జగన్ పగబట్టి మరీ వాటని నామరూపాల్లేకుండా చేశాడు. టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలోని ప్రతి పట్టణంలో ఏర్పాటు చేసిన అన్నాక్యాంటిన్లకు పేద మధ్యతరగతి కార్మికుల నుంచి విశేష ఆదరణ లభించింది. వైసీపీ ప్రభుత్వం రాగానే అన్నా క్యాంటిన్లు మూయించి రాజన్న క్యాంటిన్లు ఏర్పాటు చేస్తామన్నారు. కానీ వాటిని సచివాలయాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలుగా వినియోగించుకుంటున్నారు. ప్రొద్దుటూరు టీబీ రోడ్డులో అన్నా క్యాంటిన్‌ను మూయించి 3 వవార్డు సచివాలయంగా మార్చారు. టీడీపీ ప్రభుత్వం మళ్ళీరాగానే అన్నా క్యాంటిన్లు మళ్ళీ పేదల ఆకలి తీర్చేందుకు ఏర్పాటు అవుతాయని జనం ఆశిస్తున్నారు.

ఇదీ సంగతి....

కోడ్ అమలులో ఉన్నా జగన్ స్టిక్కర్లు అలాగే...



బద్వేలు ప్రభుత్వాస్పత్రిలో సీఎం జగన్ స్టిక్కర్స్



ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ఉన్న శిలాఫలకం

బద్వేలుటౌన్, ఏప్రిల్ 20: సుమారు నలభై రోజులు కిందటే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో జిల్లా ఎన్నికల అధికారులు ఎక్కడికక్కడ ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల ప్రతిమలు, విగ్రహాలకు ముసులు తొడిగారు. అయితే స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మాత్రం ముఖ్యమంత్రికి సంబంధించిన స్టిక్కర్లు, శిలాఫలకాలను అలాగే వదిలేశారు. ఇక్కడికి వచ్చిన వారికి ప్రభుత్వఆస్పత్రుల్లో కోడ్ వర్తించదా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. శనివారం ప్రభుత్వాస్పత్రిని సందర్శించిన డీసీహెచ్ఓ హిమదేవి డాక్టర్ల నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టిక్కర్లను, శిలాఫలకాలను ఎందుకు ఉంచారని ప్రశ్నించారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు.....

షర్మిలారెడ్డి రాకతో కాంగ్రెస్ కార్యాలయం కళకళ



కాంగ్రెస్ కార్యాలయంలో జనాల కిటకిట

కడప(కలెక్టరేట్) ఏప్రిల్ 20: 14 ఏళ్ల వనవాసం తరువాత పట్టాభిషేకం అన్నట్లుగా 2009 వైస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు జనాలతో కిటకిటలాడింది. జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ఆయన మరణంతో బోసి పోయింది. రాష్ట్ర విభజనలో కాంగ్రెస్ పాత్రపై గుర్రుగా ఉన్న ప్రజలకు వైసీపీ ఏర్పాటుతో కాంగ్రెస్ పూర్తిగా తుడుచుకు పెట్టుకు పోయి తల్లి కాంగ్రెస్ పార్టీని వీడి పిల్ల కాంగ్రెస్ అయిన వైసీపీ గూటికి చేరారు. 14ఏళ్ల తరువాత వైఎస్ రాజశేఖర్ బిడ్డ వెస్ షర్మిల రెడ్డి పీసీసీ అధ్యక్షురాలిగా పగ్గాలు చేతబట్టి శుక్రవారం కడప పార్లమెంట్‌కు ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం జిల్లా కార్యాలయానికి చేరుకున్నారు. ఆమెను చూసేందుకు, కాంగ్రెస్ పార్టీపై ఉన్న అభిమానం, మమకారంతో ప్రజలు పెద్దఎత్తున జిల్లా కాంగ్రెస్ కార్యాలయానికి చేరుకోవడంతో వాతావరణం కళతో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం ఖాయమనే భావన ప్రజల్లో వ్యక్తమౌతోంది.


రాజంపేట: చంద్రబాబునాయుడు పుట్టిన రోజు వేడుకల్లో టీడీపీ నాయకులు


నూలివీడులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


చిట్వేలి: టీడీపీ కార్యాలయంలో కేకు కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


రైల్వేకోడూరు టీడీపీ కార్యాలయంలో చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలు

ఘనంగా చంద్రబాబు నాయుడు జన్మదినం

రాజంపేట, ఏప్రిల్ 20: రాజంపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయ ఆవరణంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు జన్మదినోత్సవం సందర్భంగా భారీ కేకును కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేమన సతీష్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, రాష్ట్ర కార్యదర్శి ఇడి మడకల కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్యనాయుడు, మాజీ అధ్యక్షుడు సంజీవరావు, రాజంపేట మండల ప్రధాన కార్యదర్శి అబుబకర్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు కొండయ్య నాయుడు, వెంకటేశ్వర్లు నాయుడు, మహిళా నేత మిరియాల జ్యోతి, మాజీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నెట్టం శ్రీరాములు నాయుడు, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు తరిగోపుల లక్ష్మీనారాయణ, గీతాంజలి కళాశాల కరస్పాండెంటు ఎస్.వి.రమణ, హత్యరాల దేవస్థాన మాజీ చైర్మన్ బండారు బాలయ్య, కౌన్సిలర్లు తుపాకుల అశోక్, సుధాకర్, మాజీ కౌన్సిలర్ గుగ్గిళ్ల చంద్రమౌళి, దొంతం శివ, సుధాకర్, డెంటల్ డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గాలివీడు: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం తథ్యమని రాయచోటి టీడీపీ అభ్యర్థి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి అన్నారు. నూలివీడు యల్లమ్మ దేవాలయ ప్రాంగణంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివారెడ్డి, సర్పంచ్ పార్థసారధిరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యురాలు పార్వతమ్మ, మాజీ సర్పంచులు జగన్నాథ రెడ్డి, మహమ్మద్‌రియాజ్, భద్రప్ప, టీడీపీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, నాగేశ్వరరావు, పోలీసు రెడ్డెప్పరెడ్డి, డాక్టర్ రామచంద్రారెడ్డి, మిట్టపల్లి వెంకట్రమణారెడ్డి, కసిరెడ్డి వెంకటశివారెడ్డి, వీరరాఘవులు, ఈశ్వర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి,మహబూబ్‌బాషా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి: స్థానిక టీడీపీ కార్యాలయంలో కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు వలసాని గుండయ్య యాదవ్, గూడూరు నాగరాజు, నాగులయ్య, కరీంబాషా, వెంకటేశ్వరరాజు, సుబ్రమణ్యం, అద్భుత కుమార్, పెంచలయ్య, చంద్రమౌళి, శివ, రమణ, రోహిత్, బాలకృష్ణ యాదవ్ పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: రాఘవరాజపురం టీడీపీ కార్యాలయంలో టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. తానా మాజీ అధ్యక్షుడు వేమన సతీష్, టీడీపీ రాష్ట్ర తెలుగు యువత నాయకులు చిగురుపాటి ధనుంజయనాయుడు, కాపు నాయకులు కల్లా చలపతి, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, సీనియర్ నాయకులు బొక్కసం చలపతి, వాసుదేవరెడ్డి, బీసీ నాయకులు కమతం నాగరాజు యాదవ్, ముప్పాల రాజశేఖర్‌రాజు, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, మహిళా నాయకురాళ్లు దుద్యాల అనితదీప్తి, మెహతాజ్ తదితరులు పాల్గొన్నారు.


వీరబల్లి: కేక్‌ను కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

వీరబల్లి: మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కేకును కట్ చేసి నాయకులకు కార్యకర్తలకు పంచిపెట్టారు. గుర్రప్పగారిపల్లి పంచాయతీలో చిన్నగంగమ్మ తల్లి అమరేశ్వర్‌రాజు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అరాచకపాలనను అంతం చేస్తాం

● మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి


అడవికమ్మపల్లెలో టీడీపీలో చేరిన నాయకులు

రాయచోటి, ఏప్రిల్ 20: వైసీపీ అరాచకపాలను అంతం చేసి తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తెచ్చుకోవాలని రాయచోటి టీడీపీ అభ్యర్థి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని కస్తూరిరాజు గారిపల్లె, గురయ్యగారిపల్లె, ఎగువబత్తెప ఎల్లె, దిగువబత్తెనపల్లె, వాయిల్‌రాజుగారిపల్లెల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో ఏం అభివృద్ధి చేశారో జగన్‌రెడ్డి ప్రజలకు చెప్పాలన్నారు. రాజంపేట పార్లమెంటు యూత్ ప్రెసిడెంట్ తోపిరెడ్డి నవీన్ కుమార్‌రెడ్డి, ఎర్రగుడి చంద్రశేఖర్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నేత పాపన్న, సిద్ధక వెంకటరామిరెడ్డి, దేవనాథరెడ్డి, సుధీర్‌బాబు, ముండ్ల రాజాంజనేయులు, అంకన్న, దళితమోర్చా అధ్యక్షుడు ఓబులేసు,ఓబులేసు,యువకులు మహిళలు పాల్గొన్నారు

సంబేపల్లి: అడవికమ్మపల్లెలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మల్లు నరసారెడ్డి, మాజీ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, నాగేశ్వర్‌నాయుడు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ మల్లు విష్ణు వర్ధన్‌రెడ్డి, అర్చనా విద్యాసంస్థల అధినేత మదన్ మోహన్‌రెడ్డితో కలిసి శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం వైసీపీకి చెందిన ప్రభాకర్‌నాయుడు, జనార్దన్‌నాయుడు, వెంకటేశ్వరనాయుడు, సుబ్రమణ్యం నాయుడు, ఆనంద్‌నాయుడు, అంజికి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.


సిద్దవటం: ఇంటింటా ప్రచారం చేస్తున్న కుప్పాల వెంకటసుబ్బయ్య


రాజంపేట ఆర్‌ఎస్‌రోడ్డులో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ, జనసేన నేతలు


నాగిరెడ్డిపల్లె గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న కూటమి నాయకులు

'వైసీపీ వైఖరి నచ్చకనే టీడీపీలోకి వలసలు'

సుండుపల్లె, ఏప్రిల్20: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి నిరోధకుడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని, వైసీపీ పాలన నచ్చకనే ప్రతి గ్రామంలో ఆ పార్టీ నాయకులు టీడీపీలోకి వస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు తెలిపారు. శనివారం మండలంలోని తిమ్మసముద్రం గ్రామ పంచాయతీలో ఎన్నికల ప్రచారాన్ని ఆయన ప్రారంభించారు. బీజేపీ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే టీడీపీ అభ్యర్థి సుగవాసి సుబ్రమణ్యంలను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ ఐదేళ్లలో గ్రామ పంచాయతీల్లో ఏ ఒక్క అభివృద్ధి పనికి శిలాఫలకం వెయ్యలేదని ఓటర్లకు తెలియజేశారు. ప్రజా ప్రయోజనాలను కాంక్షించని ప్రభుత్వం అవసరమా అని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో అభివృద్ధి నిరోధకునికి, అభివృద్ధి ప్రదాతకు మధ్యన పోటీ జరుగుతోందన్నారు. అభివృద్ధి చేసే చంద్రబాబునాయుడుకు అండగా నిలవాలని అభ్యర్థించారు. అనంతరం కుంటలముందర గ్రామ పంచాయతీకి చెందిన యువకులు పెద్ద సంఖ్యలో టీడీపీలో చేరారు. అలాగే వైసీపీ నేత మారుతీ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రెడ్డెప్ప, క్లస్టర్ ఇన్‌చార్జి శివకుమార్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌రాజు, చప్పిరెడ్డి రమేశ్‌నాయుడు, రామనాధరెడ్డి, మాజీ ఎంపీటీసీ మోహన్‌బాబు నాయుడు, దామోదర్‌నాయుడు, వెంకటేశ్వర్‌నాయుడు, సత్యంనాయుడు, జయరాంనాయుడు, సుబ్బారెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి శ్రీనివాసులునాయుడు, బూత్ ఇన్‌చార్జి నరసింహులు, రామాంజులు, సురేశ్‌నాయుడు, చంద్రశేఖర్‌రాజు, శివరాంనాయుడు పాల్గొన్నారు.

నేకనాపురం, పాలకొండ్రాయునిపల్లెల్లో ..

సిద్దవటం : సిద్దవటం మండలంలోని నేకనాపురం, పాలకొండ్రాయునిపలెల్లో శనివారం రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం సోదరుడు జానకీరామ్, రాజంపేట జనసేన నాయకులు అతికారి కృష్ణ, టీడీపీ నాయకులు కుప్పాల వెంకట సుబ్బయ్య ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని చంద్రబాబును ముఖ్యమంత్రి పీఠం ఎక్కించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి తుర్రాప్రతాప్ నాయుడు, టీడీపీ మండల నాయకులు మోహన్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి దశరథరామానాయుడు, జనసేన నాయకులు నాగరాజు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. మాచుపల్లిలో ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


కుంటల ముందర గ్రామస్తులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న సుగవాసి ప్రసాద్‌బాబు

రాజంపేట: రాజంపేట ఆర్‌ఎస్ రోడ్డులో శనివారం సాయంత్రం టీడీపీ, జనసేన నేతలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. టీడీపీ జిల్లా పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, జనసేన పార్టీ పార్లమెంటు ఎన్నికల పరిశీలకులు శ్రీనివాసరాజు, ఎమ్మెల్యే సోదరుడు, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ ప్రచారంలో పాల్గొన్నా. తెలుగుదేశం అధికారంలోకి వస్తే అమలుచేయనున్న సూపర్ సిక్స్ పథకాలన్ను వివరించారు. తన అన్న సుగవాసి బాలసుబ్రమణ్యంను బీజేపీ ఎంపీ అభ్యర్థి మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలన్నారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్యనాయుడు, మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లనాయుడు, దంత వైద్యులు డాక్టర్ నవీన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తుపాకుల అశోక్, రాజంపేట పట్టణ మాజీ అధ్యక్షుడు సంజీవరావు, గీతాంజలి కళాశాల అధినేత ఎం.వి.రమణ, గుగ్గిళ్ల చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

నందలూరు : నందలూరు మండలం నాగిరెడ్డిపల్లెలో శనివారం జనసేన బీజేపీ, టీడీపీ కూటమి ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. కమలంగుర్తుకు ఓటు వేసి రాజంపేట పార్లమెంటు అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని, సైకిల్ గుర్తుకు ఓటు వేసి రాజంపేట అసెంబ్లీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంని అత్యధిక మెజారిటీతో గెలిపించి ఇప్పుడు ఉన్న ఈ రాక్షస ప్రభుత్వాన్ని సాగనంపాలని పిలుపునిచ్చారు. . జనసేన పార్టీ రాజంపేట పార్లమెంటు ఎన్నికల సమన్వయకర్త యల్లటూరు శ్రీనివాసరాజు, మైనారిటీ నేత కమాల్‌బాషా, ఆర్టీసీ మాజీ చైర్మన్ ఎద్దల సుబ్బరాయుడు, యల్లటూరు శివరామరాజు, షబ్బీర్ అహమ్మద్, నాగిరెడ్డిపల్లె మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, మాడపూరి హేమలత, అగ్రికల్చరల్ మార్కెట్ మాజీ చైర్మన్ ఎద్దల విజయసాగర్, మైనారిటీ నాయకులు సయ్యద్ అమీర్, జయచంద్రా రెడ్డి, పోతుల రాము, సునీత వర్మ, నాగేశ్వరరావు, ఆదినారాయణ, ఆకుల చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తాం

రైల్వేకోడూరు(రూరల్) ఏప్రిల్ 20: ఒక్క అవకాశం ఇస్తే రైల్వేకోడూరు అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపిస్తామని టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానంద రెడ్డి సతీమణి వరలక్ష్మి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మండలంలోని వెంకటరెడ్డిపల్లె పంచాయతీ పరిధిలోని రాచపల్లె, అరుంధతి వాడ, గిరిజనకాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, టీడీపీ మండల అధ్యక్షుడు కొమ్మ శివ, జనసేన సీనియర్ నాయకుడు అలం రమేష్, నగిరిపాడు మాజీ సర్పంచ్ కట్ట ఉషాదేవి, మైసూరి వారిపల్లె సర్పంచ్ సంయుక్త, అనితాదీప్తి పాల్గొన్నారు.

చిట్వేలి : భావితరాల భవిష్యత్తు కోసమే ఉమ్మడి కూటమి ఏర్పడిందని ఇందుకు ప్రజలు మద్దతుగా నిలిచి గాజుగ్లాసు, కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ముక్కా శిరీష తెలిపారు. శనివారం మండల పరిధిలోని మైలపల్లె పంచాయతీలో జట్టువారిపల్లె నడింపల్లె, హరిజనవాడ, అరుంధతి వాడ, వడ్డిపల్లెలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ముక్కా సాయి వికాస్‌రెడ్డి, రాజుకుంట సర్పంచ్ గుత్తి నరసింహ, ఎంపీటీసీ నాగార్జున, అడ్వకేటు బాలాజీ, లారీ సుబ్బరాయుడు, మాదాసు నరసింహ, నరసింహరాజు, పవన్ రాజు, నాగరాజు, వేణుగోపాల్‌రెడ్డి, నాగేంద్ర, పాండురాజు నాగరాజు, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, తేజ, తిరుమలయ్య, నగేష్, సుబ్బయ్య, చిన్నయ్య, రామయ్య, మన్మథ , పగడాల వెంకటేష్, పెంచలయ్య, ప్రణీత్, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


ప్రచారంలో పాల్గొన్న కూటమి నాయకులు

వాహన సేవకుల మధ్య వివాదం..

ఒంటిమిట్ట, ఏప్రిల్ 20:ఒంటిమిట్ట కోదండరామాలయ బ్రహ్మోత్సవాల్లో వాహనాన్ని తామే మోయాలంటూ స్థానిక, టీటీడీ సేవకుల మధ్య శనివారం వివాదం ఏర్పడింది. ఈ విషయంపై వాగ్వాదం చేసుకుంటున్న దృశ్యాలను చిత్రీకరిస్తున్న మీడియాపై ఎస్ఐ మధుసూదన్‌రావు అత్యుత్సాహం ప్రదర్శించారు. వీడియో చిత్రీకరించవద్దంటూ దురుసుగా ప్రవర్తించడంతోపాటు పరుష పదజాలం ప్రయోగించారు.


టీటీడీ విజిలెన్స్ అధికారులతో చర్చిస్తున్న వాహన సేవకులు

ప్రతి పౌరుడు ఓటు హక్కు వినియోగించుకోవాలి

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 20 : ఓటర్లందరూ, మే 13న విధిగా ఓటింగ్‌లో పాల్గొనాలని, నూరు శాతం ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోవాలంటూ ఎంపీడీవో కుళ్లాయి స్వామి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఆర్ఐ రామ్మో హన్, ఏపీఎంఆర్ముగం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అన సూయమ్మ, హెచ్‌ఎం టి.వెంకటరమణయ్య, ఎంఈవో జి.రెడ్డయ్య పాల్గొన్నారు.

చిన్నమండెం:మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి ఓటు ప్రాధాన్యతను వివరించారు.తహసీల్దార్ ఆనంద్‌కుమార్, ఎంపీడీవో రామకృష్ణ, డీటీ శ్రీధర్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, ప్రజా సంఘాలు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు(రూరల్): మండల పరిషత్ కార్యాలయం నుంచి టోల్‌గేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎన్నికల అధికారి టి.లీలారాణి, రైల్వేకోడూరు తహసీల్దార్ శివ రాముడు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చిట్వేలి: స్థానిక తహశీల్దారు కార్యాలయం నుంచి జడ్పీహైస్కూల్ వరకు విద్యార్థులు ఐసీడీఎస్, వెలుగు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేశారు.తహసీల్దారు జ్ఞానేశ్వరి, ఎంపీడీవో రంగారావు , ఎంఈవోలు కోదండనాయుడు, ఈశ్వర య్య, సీడీపీవో రాజేశ్వరి, ఆర్ఐ శేషం రాజు పాల్గొన్నారు.

పుల్లంపేట : స్థానిక తహసీల్దారు కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో తహసీల్దారు వెంకటనారాయణ, ఎంపీడీవో నరసింహమూర్తి, ఎంఈవోలు చక్రధర్‌రాజు, నాగా తిరుమలరావు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనగలూరు : రెవెన్యూ కార్యాలయం నుంచి మూడు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దారు సీహెచ్ ఇంద్రాణి ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, ఏసీ, ఏపీఎం నిరంజన్ కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్‌మేళా నిర్వహించాలి: డీపీఎంవో

రాయచోటిటౌన్, ఏప్రిల్ 20: ఆయుష్మాన్ భారత్ మందిర్‌లలో ప్రతి శనివారం తప్పనిసరిగా హెల్త్ మేళా నిర్వహించాలని అన్నమయ్య జిల్లా జాతీయ ఆరోగ్య మిషన్ పర్యవేక్షణ అధికారి (డీపీఎంవో) డాక్టర్ రియాజ్‌బేగ్ ఆదేశించారు. శనివారం ఆయన టీ. చాకిబండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తూర్పుపల్లిలో 104 సేవలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లలో శనివారం రోజు హెల్త్ మేళా నిర్వహించి ప్రజలకు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలతో పాటు వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని, ఓఆర్ఎస్ ఉపయోగాలు, తయారీపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి బుధవారం సీహెచ్‌వోలు నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించి ఫలితాలను యాప్‌లలో అప్డేట్ చేయాలన్నారు. ప్రతి రోజు ఓపీ వివరాలు ఆన్‌లైన్ చేయాలని, ప్రజలకు నిర్దేశించిన మందులు, 14 రకాల పరీక్షలు అందుబాటులో ఎల్లవేళలా ఉండే విధంగా పనిచేయాలని సూచించారు. అనంతరం శనివారం రోజు నిర్వహించే వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమ డేటాను యువిన్ పోర్టల్‌లో పరిశీలించారు. ప్రతి బిడ్డకు తప్పకుండా వేయాల్సిన టీకాలను గడువులోపు వేయాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో పనిచేసేసీహెచ్‌వో, సచివాలయ ఏఎన్‌యంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలి

రాయచోటిటౌన్, ఏప్రిల్ 20: గ్యాస్ లీకేజీతోజరిగే ప్రమాదాలపై మహిళలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి అనిల్‌కుమార్ సూచించారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా పట్టణంలోని మెప్మా కార్యాలయంలో మహిళా సంఘాలకు, డ్వాక్రా మహిళలకు గ్యాస్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు, స్వయం సహాయ సంఘాల లీడర్లు, మహిళా సంఘాల నేతలు వారి పరిధిలో గ్యాస్ వినియోగంపై అవగాహన కల్పించిలన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి అగ్నిమాపకశాఖ అధికారి వెంకట్రామిరెడ్డి, మెప్మా అధికారి అబ్బాస్‌అలీఖాన్, ఫైర్ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి: లక్కిరెడ్డిపల్లెలోని నలంద హైస్కూల్‌లో విద్యార్థులకు ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో అగ్నిప్రమాదాలు జరిగినపుడు తీసుకోవాల్సిన జాగ్రతలు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బాలసుబ్రమణ్యం, చిన్నరమణ ఉపాయులు, ఫైర్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దోమల నివారణతో జ్వరాల నివారణ

సంబేపల్లె, ఏప్రిల్ 20: దోమల నివారణతోనే జ్వరాలు నివారించవచ్చునని సంబేపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌వో రాణి తెలిపారు. శనివారం పెద్దజంగంపల్లెలో పైరిత్రియం పిచికారీ చేశారు. లార్వాలను గుర్తించి నాశనం చేశారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. జ్వరాల బారిన పడినపుడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి వైద్య సేవలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పూర్ణమ్మ, హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్, సచివాలయం ఏఎన్‌యం దుర్గ, ఆశావర్కర్ వారాధి తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు

రైల్వేకోడూరు(రూరల్) ఏప్రిల్ 20: నియోజకవర్గ వడ్డెర సంఘం నూతన కమిటీ సభ్యులను శుక్రవారం సంఘం గౌరవ అధ్యక్షుడు మదనపల్లి రవి, ఉపాధ్యక్షుడు పందిపాటి చిట్టిబాబు ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. అధ్యక్షుడుగా బత్తల విజయ్ కుమార్ ఉపాధ్యక్షుడుగా వల్లెపు నరసింహులు ప్రధాన కార్యదర్శిగా పసుపులేటి వెంకటరమణ, కార్యదర్శిగా పుల్లగంటి చంద్ర, కోశాధికారిగా మల్లిబోయిన కృష్ణను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు.

ఎన్‌డీఏ అభ్యర్థుల విజయానికి సహకరించండి

ఒంటిమిట్ట, ఏప్రిల్ 20 : ఉమ్మడి ఎన్‌డీఏ అభ్యర్థుల విజయానికి మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మ య్య తనయులు పసుపులేటి వీరపవన్, పసుపులేటి ప్రదీప్‌లు కోరారు. శనివారం స్థానిక హరిత హోటల్‌లో టీడీపీ నాయకులు, బ్రహ్మయ్య అభిమానులతో సమా వేశం ఏర్పాటు చేశారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఆదివారం సాయంత్రం నిర్వహించనున్న ఆత్మీయ సమావేశానికి నాయ కులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాంట్రా క్టర్ రమణ, పత్తి సుబ్బరాయుడు, చింతగింజల సుబ్రమ ణ్యం, బొబ్బిలి రాయుడు, బుజ్జి పలువురు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లో రోగులకు భద్రత కల్పించాలి


రాయచోటిటౌన్, ఏప్రిల్ 20: ప్రైవేటు ఆసుపత్రుల్లో రోగులకు భద్రత కల్పించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అబ్బవరం రామాంజులు డిమాండ్ చేశారు. శనివారం ఆయన పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం రాత్రి మదనపల్లె రోడ్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో లిఫ్ట్ కూలిపోయి రోగులకు కాళ్లు, చేతులు విరగడం బాధాకరం అన్నారు. ఇప్పటికీ రాయచోటిలోని పలు ఆస్పత్రులో ఫైర్ సేఫ్టీతో పాటు బాత్ రూమ్‌లు, ల్యాబ్‌లు లేవని, అర్హత లేని వారితో తక్కువ జీతంతో వైద్యం చేయిస్తున్నారని ఆరోపించారు. అనుమతి లేని ఆసుపత్రులను వెంటనే రద్దు చేసి, కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు తగు చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామచంద్ర, సీఐటీయూ నాయకులు నాగభూషణం, వెంకటరమణ పాల్గొన్నారు.

రూపానందరెడ్డిని కలిసిన వైసీపీ ఉపసర్పంచ్


రూపానందరెడ్డిని కలసిన పెనగలూరు ఉపసర్పంచ్ చిన్నవెంగల్‌రెడ్డి తదితరులు

పెనగలూరు, ఏప్రిల్ 20 : పెనగలూరు గ్రామ ఉపసర్పంచ్ చిన్నవెంగల్‌రెడ్డి శుక్రవారం రాత్రి రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా పెనగలూరుకు సంబంధించి పలు రాజకీయ అంశాలపై చర్చించినట్లు సమాచారం. మిథున్‌రెడ్డి ముఖ్యఅనుచరుడిగా ఉంటున్న ఆయన శనివారం వైసీపీ నాయకులు, కార్యకర్తల సమావేశానికి గైర్హాజరై, ఇండ్లూరులోని తన ఇంటి వద్ద అనుచరగణంతో రాజకీయ భవితంపై చర్చించారని సమాచారం. ఇదిలాఉండగా ఈ నెల 24న టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నట్లు సమాచారం. పెద్దవెంగల్‌రెడ్డి, చిన్నపరెడ్డి, కోడూరు మురళీ, నరసింహ, వెంకటసుబ్బయ్య, వేణుగోపాల్ రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, కోడూరువిజయభాస్కర్, ఓబిలి మాజీ సర్పంచ్‌నారాయణ, సింగనమల జనార్ధన్, జయరామయ్య, నాగేష్, రమణ తదితరులు ఉన్నారు.

చంద్రబాబుకు వీరాభిమాని దగ్గుబాటి


నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డికి కేక్ తినిపిస్తున్న దగ్గుబాటి వెంకటేశ్వరరావు

కలకడ, ఏప్రిల్ 20:టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుని ఆరాధ్య దైవం గా భావించే దగ్గుబాటి వెం కటేశ్వరరావు 1992 నుంచి క్రమం తప్పకుండా ఆయన జన్మదిన వేడుకల సందర్భం గా ఏదో ఒక సామాజిక కా ర్యక్రమం నిర్వహిస్తున్నారు. గతంలో చంద్రబాబు జన్మ దినం సందర్భంగా వాల్మీకి పురంలోని కోదండ రామాలయానికి రూ1.05 లక్షల విలువ చేసే బంగారు హారాన్ని బహూకరించారు. ప్రతి ఏటా ఈ సందర్భంగా ఎన్టీఆర్ ట్రస్టుకు రూ.లక్ష వంతున విరాళాన్ని ఇస్తున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా తన కుమారుడు పొందిన తొలి నెల జీతా న్ని ట్రస్ట్‌కు అందజేశారు. 2018 నుంచి జననేత నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి జన్మదిన ం సందర్భంగా సెప్టెంబరు 13వ తేదీన కూడా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించ డంలో ముందున్నారు. టీడీపీ అభివృద్ధికి నిరంతరంగా కృషి చేస్తున్నారు. నేతలు మల్లారపు రవిప్రకాశ్, సూర్యప్రకాశ్, పొత్తూరి ప్రభాకర్ నాయుడు, శ్రీని వాసుల రెడ్డి, తిరుపతినాయుడు, వెంకటరమణనాయుడు, కాంతారావు, పునీత్‌చౌదరి, తారకేశ్వర, చంద్ర మోహన్, త్యాగరాజు, శ్రీనివాసులనాయుడు, ఆనంద్‌నాయుడు, వీవీ నాయు డు, వసంతనాయుడు, రమణనాయుడు, వాటర్‌షెడ్ రవి, ఆనంద్‌రెడ్డి, జనార్దన్ నాయుడు, చంద్రబాబునాయుడులు పాల్గొన్నారు.

మూడో రోజు.. ముగ్గురు స్వతంత్రుల నామినేషన్

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 20: జిల్లాలో మూడోరోజు స్వతంత్ర అభ్యర్థు లే ఎక్కువగా నామినేషన్లు వేశారు. ప్రధాన పార్టీల తరఫున ఒక్క నామినేష న్ కూడా దాఖలు కాలేదు. మదనపల్లెలో మణిశంకర్, నరేంద్ర ఇద్దరూ ఇం డిపెండెంట్ అభ్యర్థులుగా నామినేషన్‌లు వేశారు. రైల్వేకోడూరు నుంచి మా ధా రాజా రాజంపేట పార్లమెంటుకు ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అలాగే రాజంపేట అసెంబ్లీకి బొక్కే విశ్వనాధనాయక్ సీపీఐ తరఫున నామినేషన్ వేయగా షేక్ సల్మాన్, కోనేటి హరి, వెంకట్రమణ, స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. అలాగే పీలేరు నియోజకవర్గం నుంచి నలుగురు అభ్యర్థులు ఇండిపెండెంట్లుగా నామినేషన్లు వేశారు. పలవల రామక్రిష్ణారెడ్డి, మహేశ్‌రెడ్డి, బ్రహ్మయ్య ఆచారి, చిన్నరెడ్డెప్పరెడ్డిలు వాల్మీకిపురం చెందినవారు కావడం విశేషం. రాయచోటి అసెంబ్లీ స్థానానికి రేపన మనోహర్ అన్నావైఎస్ఆర్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు.



డమ్మీ ప్లాన్

శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలు అన్నట్లు ఎన్నికల్లో పోటీచేస్తున్న ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు అదనపు వాహనాలు, ఏజెంట్లు నియామకం కోసం డమ్మీ అభ్యర్థులచే నామినేషన్ వేసేందుకు రంగం సిద్ధం చేసుకొంటున్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం పోటీచేసే అభ్యర్థికి వాహనాల సంఖ్య పరిమితం. అయితే ఆ వాహనాల సంఖ్య సరిపోదని ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు కొందరు డమ్మీ అభ్యర్థులచే నామినేషన్ వేస్తారు. ఇలా నామినేషన్ వేసిన డమ్మీ అభ్యర్థులు నియోజకవర్గంలో ఎక్కడా తమ ప్రచార కార్యక్రమాలు నిర్వహించరు. వీరి వాహనాలు మాత్రం ఏ పార్టీ జెండా లేకుండా కేవలం అభ్యర్థి స్టిక్కర్లు వేసుకొని నియోజకవర్గంలో ప్రధాన రాజకీయ పార్టీ అభ్యర్థి సేవలకు ఉపయోగ పడుతుంటారు. అంతేగాక బూత్‌లలో వీరి తరఫున ఏజెంట్లుగా కూడా ప్రధాన రాజకీయపార్టీల అభ్యర్థులే నియమించుకొంటారు. ఎవరు ప్రశ్నించినా తమకు సంబంధంలేదని ఇండిపెండెంట్ అభ్యర్థి ఏజెంట్లు అని చెబుతారు. ఇటువంటి డమ్మీ అభ్యర్థులపై ఎన్నికల అధికారులు నిఘావేయాల్సిన అవసరం ఎంతైనా వుందని ప్రజలు అంటున్నారు.

- పలమనేరు



ప్రచారంలో కరపత్రాలు అందజేస్తున్న చల్లా సుప్రియారెడ్డి, పూజారెడ్డి

ఇదీ మందు

సకుటుంబ సపరివారంగా...


తల్లి ఒకచోట, భార్య రొంపిచెర్ల, కుమార్తె పులిచెర్ల, సోదరి చౌడేపల్లె.. ఇలా ఆయా మండలాలను ఎంపిక చేసుకుని పుంగనూరు టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి (చల్లాబాబు) కుటుంబ సభ్యులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. బాబు సతీమణి మాజీ సర్పంచ్ చల్లా సుప్రియారెడ్డి ఇంటింటా తిరుగుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఆయన తల్లి, రొంపిచెర్ల మాజీ ఎంపీపీ చల్లా ప్రేమలత సమీప గ్రామస్తులను కలుస్తున్నారు. ఆయన కుమార్తె పూజారెడ్డి పులిచెర్ల మండలంలో టీడీపీ నాయకులు, తెలుగుమహిళలతో కలిసి ప్రతి గడపకూ వెళుతూ తండ్రిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. ఇక సోదరి వీణారెడ్డి చౌడేపల్లె మండలంలో ప్రచార బాధ్యతలను చేపట్టారు. గతంలో పుంగనూరు గొడవల కేసుల్లోని బాధిత టీడీపీ శ్రేణులకు వీరంతా బాసటగా నిలిచారు.


- పుంగనూరు

నాకేంటట...

పార్టీలో చేరాలా, గెలుపుకోసం పనిచేయాలా అయితే నాకు ఏమిస్తారంటూ ఒక సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు మొహమాటం లేకుండా అడిగేసరికి నాయకులు ఖంగుతిన్నారు. పలమనేరు నియోజకవర్గంలోని ఒక ప్రముఖ పార్టీనుంచి పోటీచేస్తున్న అభ్యర్థి అనుచరులు సింగిల్ విండో మాజీ అధ్యక్షుడిని కలిశారు. తమ పార్టీలో చేరి ప్రచారం చేయాలని కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ ఇప్పటికే రాజకీయాల్లో పదిహేనెకరాలు అమ్ముకున్నాను. నా వద్ద ఏమీ లేదు. ఇప్పుడు పార్టీలో చేరితే వెంట వచ్చేవారిని నెలరోజులు పోషించాలి. ఎప్పుడో అధికారంలోకి వస్తాం.. ఏదో చేస్తామంటే మోసపోయే వాణ్ణి కాదు. ఇప్పుడేమిస్తారో చెప్పండనే సరికి నాయకులు తెల్లముఖమేశారు. అభ్యర్థినే పంపిస్తామని చెప్పి అక్కడ నుంచి జారుకున్నారు.

- పలమనేరు






నా ఎస్సీలు, నా బీసీలు, నా పేదలు.. అంటూ ప్రతి సభలోనూ సీఎం జగన్ చెబుతారు. తాను లేకుంటే వీరికి సంక్షేమమే లేదని మాటలు చెబుతారు. కానీ.. ఆ పేదలకు ఇవ్వాల్సిన రేషన్ బియ్యాన్ని 16 నెలలుగా నిలిపేశారు. ఈ లెక్కన జిల్లాకు 1.36 లక్షల టన్నుల బియ్యాన్ని కార్డుదారులు నష్టపోయారు. కేంద్రం ఇస్తున్న ఉచిత బియ్యాన్నే తనదిగా రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది.

- చిత్తూరు కలెక్టరేట్



కేంద్రం ఇస్తున్న ఉచిత బియ్యాన్ని ఎండీఎస్ వాహనం ద్వారా కార్డుదారులకు పంపిణీ చేస్తున్న సిబ్బంది (ఫైల్ ఫొటో)

పేదల బియ్యం ఎగ్గొట్టిన జగన్



16 నెలలుగా రూపాయి బియ్యం నిలిపివేత

ఉమ్మడి జిల్లాలో 1.36లక్షల టన్నులు ఇవ్వని రాష్ట్రం

కేంద్రం ఇస్తున్న ఉచిత బియ్యాన్నే తనదిగా ప్రచారం

కొవిడ్ సమయంలో ఉపాధి లేక.. ఇబ్బంది పడుతున్న పేదలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్నయోజన' కింద ఉచిత బియ్యం అందిస్తోంది. రేషన్‌లో ఇచ్చే బియ్యం విలువ కిలో రూ.35. అందులో కేంద్రం రూ.30, రాష్ట్రం రూ.5 భరిస్తోంది. కుటుంబంలో ఒకరికి ఐదు కిలోల చొప్పున 2020 ఏప్రిల్ నుంచి ఇస్తోంది. ఇక, రాష్ట్ర ప్రభుత్వం రూపాయికి కిలో బియ్యాన్ని పంపిణీ చేస్తూ వచ్చింది. ఉచిత బియ్యాన్ని డీలర్ల వద్ద.. నగదుకు బియ్యాన్ని ఎండీఎస్ వాహనాల ద్వారా కార్డుదారులకు ఇస్తూ వచ్చారు. కేంద్రం ఇస్తున్న ఉచిత బియ్యాన్ని 2022వ సంవత్సరం ఏప్రిల్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఆపేసింది. దీనికి ఎలాంటి కారణాలు చూపలేదు. సార్టెక్స్ బియ్యం పేరిట కేంద్రంతో పేచీకి దిగింది. ఉచిత బియ్యం ఇవ్వకపోవడంపై బీజేపీ రాష్ట్ర నాయకులు కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతో వారు సీరియస్ అయ్యారు. ఆ తర్వాత జూలై నుంచి ఉచిత బియ్యాన్నీ పునఃప్రారంభించారు. మొత్తమ్మీద 2022వ సంవత్సరం డిసెంబరు వరకు కార్డుదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలిచ్చే ఉచిత.. నగదుకు బియ్యాన్ని (రెండు కోటాలు) ఇచ్చారు.

మేమూ ఉచితంగా ఇస్తామంటూ..



కేంద్ర ప్రభుత్వం ఉచిత బియ్యం పంపిణీని 2023 డిసెంబరు వరకు పొడిగిస్తూ 2022 చివర్లో నిర్ణయం తీసుకుంది. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం కూడా నగదుకు కాకుండా తామూ ఉచితంగానే రేషన్ బియ్యం ఇస్తామని చెప్పింది. కరోనా తీవ్రంగా ఉన్న రోజుల్లోనే ఉచితంగా ఇవ్వని రాష్ట్రం.. కొవిడ్‌లేని సమయంలో ఉచిత ప్రకటన చేయడం వెనుక ఆంతర్యం ఏమిటా అని పలువురు మల్లగుల్లాలు పడ్డారు. ఏమైతేనేం తవకుఉ కేంద్ర, రాష్ట్రాలకు సంబంధించి రెండు కోటాల బియ్యం ఉచితంగా వస్తాయని కార్డుదారులు భావించారు. అయితే, కేంద్రం ఇస్తున్న ఉచిత బియ్యాన్ని మాత్రమే రేషన్ షాపుల్లో పంపిణీ చేశారు. రాష్ట్ర బియ్యాన్ని ఇవ్వలేదు. ఇక, ఉచిత బియ్యాన్ని మరో ఏడాది పొడిగిస్తూ కేంద్రం 2003 చివర్లో నిర్ణయం తీసుకుంది. ఇలా 16 నెలలుగా కేంద్రం ఇస్తున్న ఉచిత బియ్యంతోనే రాష్ట్రం సరిపెట్టేసింది. ఓహో.. రాష్ట్రం ఇస్తామన్న ఉచితం వెనుక ఇదా కథ అని నెమ్మదిగా కార్డుదారులకు అర్థమైంది.

పేదలకు ఇవ్వని 1.36 లక్షల టన్నుల బియ్యం

ఉమ్మడి జిల్లాలో సరాసరి 5.30 లక్షల రేషన్‌కార్డులు చెలామణిలో ఉన్నాయి. నెలకు 8500 టన్నుల ఉచిత బియ్యం అవసరం. 2023 జనవరి నుంచి 2024 ఏప్రిల్ వరకు 16 నెలలపాటు.. నెలకు 8500 టన్నుల వంతున 1.36లక్షల టన్నుల బియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకుండా ఎగ్గొట్టింది. కేంద్రం ఇస్తున్న బియ్యాన్నే తాము ఉచితంగా ఇస్తున్నట్లు బిల్డప్ ఇస్తూవచ్చింది.

ఏడాదికి ఓ కుటుంబం నష్టపోయింది 7200 రూపాయలు

కేంద్రం ఇచ్చే బియ్యానికి అదనంగా ఒక్కొక్కరికి ఐదు కిలోల చొప్పున బియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమూ ఇవ్వాలి. అలా.. నలుగురు కుటుంబ సభ్యులున్న కుటుంబానికి రూ.20కి 20 కిలోల బియ్యం ఇచ్చుంటే నెలకు సరిపేడది. ఇప్పుడా పరిస్థితి లేదు. ప్రస్తుత బహిరంగ మార్కెట్‌లో కిలో బియ్యం రూ.40 నుంచి రూ.70 వరకు పలుకుతోంది. రేషన్ బియ్యం ధర రూ.30 అనుకున్నా.. నలుగురున్న కుటుంబానికి నెలకు రూ.600 .. ఏడాదికి రూ.7200 నష్టపోయినట్లే. అసలే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, విద్యుత్ ఛార్జీల మోత, ఆస్తి పన్ను బాదుడుతో సతమతమవుతున్న పేదలకు.. రాష్ట్రం కోటా రేషన్ బియ్యం కూడా పంపిణీ చేసుంటే కొంత ఊరటగా ఉండేది.

పూతలపట్టు వర్తమానం

పూతల'పట్టు'కు టీడీపీ వ్యూహం

- ఏడాదిగా ప్రజల మధ్య మురళీమోహన్
- సమన్వయం, సమర్థ నాయకత్వంతో అడుగులు
- ఎంఎస్ బాబు పోటీతో అధికార వైసీపీలో గుబులు

పూతలపట్టు నియోజకవర్గం ఆవిర్భవించాక ఒక్కసారి కూడా గెలవని టీడీపీ ఈసారి ఎలాగైనా విజయం సాధించాలని గట్టి పట్టుదలతో ఉంది. ఆ పార్టీ అభ్యర్థి మురళీమోహన్ అన్ని మండలాల్లోని కింది స్థాయి నుంచి మండల, నియోజకవర్గ స్థాయి నాయకులను కలుపుకొని ముందుకెళుతున్నారు.

- చిత్తూరు



మురళీమోహన్

2009 పునర్విభజనలో ఏర్పడిన పూతలపట్టు నియోజకవర్గం నుంచి మొదటి ఎన్నికలో కాంగ్రెస్ తరఫున డాక్టర్ రవి విజయం సాధించారు. 2014లో సునీల్‌కుమార్, 2019లో ఎంఎస్‌బాబు వైసీపీ నుంచి గెలిచారు. గత రెండు ఎన్నికల్లోనూ టీడీపీ అభ్యర్థి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. వరుసగా మూడు ఎన్నికల్లో ఓడిపోయిన లలిత కుమారి 2019 తర్వాత రాజకీయాలకు దూరమయ్యారు. దీంతో ఆ పార్టీ గతేడాది మురళీమోహన్‌కు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించింది. అప్పటి నుంచి ఆయన నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో విస్తృతంగా పర్యటిస్తూ పార్టీ కార్యక్రమాలను కుగ్రామాలకు సైతం తీసుకెళుతున్నారు. ఇటీవల చేపట్టిన జయహో బీసీ సభలకు స్పందన బాగుంది. వైసీపీ నుంచి పెద్ద ఎత్తున పార్టీలో చేరారు. గట్టి పట్టున్నప్పటికీ నాయకత్వలేమితో ఇబ్బందులు పడుతున్న కార్యకర్తలకు ఆ లోటు తీరుస్తూ మురళీమోహన్ నేనున్నానంటూ భరోసా ఇస్తూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నారు. టికెట్ రాని సిట్టింగ్ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల వల్ల వైసీపీ ఓట్లకు గండి పడటం తమకు అనుకూలిస్తుందని టీడీపీ నేతలు లెక్కలు వేసుకుంటున్నారు.

అక్రమాలపై ప్రజా వ్యతిరేకత

వైసీపీ నేతల అండదండలతో కొందరు తవణంపల్లె, బంగారుపాళ్యం, పూతలపట్టు, ఐరాల, యాదమరి మండలాల్లో కర్ణాటక మద్యాన్ని విచ్చలవిడిగా విక్రయించి సొమ్ముచేసుకున్నారు. ఇసుక, మట్టిలనూ తరలించారు. అనుమతుల్లేకుండా రాత్రి వేళల్లో గ్రానైట్ రాళ్లను ఇతర రాష్ట్రాలకు తోలి లక్షలాది రూపాయలను సంపాదించారు. ప్రతి మండలంలోనూ పేకాట క్లబ్బుల ద్వారా డబ్బులు వెనకేసుకున్నారు.అధికార పార్టీ నేతల అవినీతి, అక్రమాలపై ప్రజల్లో బలమైన వ్యతిరేకత ఉంది. వైసీపీ టికెట్ పొందిన సునీల్ కుమార్ నాయకత్వంపై నియోజకవర్గ స్థాయి నేతలు అసంతృప్తిగా ఉన్నారు. సునీల్‌కు టికెట్ రావడం ఓ మంత్రికి కూడా ఇష్టంలేదని ఆ పార్టీ వారే చెప్పుకుంటున్నారు.



సునీల్‌కుమార్

వైసీపీకి బాబు స్ట్రోక్

జిల్లా మంత్రి, నియోజకవర్గంలోని పార్టీ సామాజిక వర్గాల నాయకులు చెప్పినట్లు నడుచుకోలేదనే కారణంతో సిట్టింగ్ ఎమ్మెల్యే ఎంఎస్‌బాబుకు వైసీపీ ఈసారి టికెట్ ఇవ్వలేదు. దాంతో ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే రవి కూడా ఎంఎస్ బాబుతో జతకట్టారు. ఎంఎస్ బాబుకు సొంత మండలం యాదమరితో పాటు మిగిలిన మండలాల్లో బంధువర్గం ఉంది. ఈ ఐదేళ్ల పార్టీ పరంగానే కాకుండా వ్యక్తిగతంగా చేసిన మేలుతో పాటు వైసీపీపై ఉన్న వ్యతిరేకతను తమకు అనుకూలిస్తుందని ఈయన భావిస్తున్నారు.




ఎంఎస్ బాబు

హేమాహేమీల ప్రాతినిధ్యం

● నగరి చరిత్ర

రెండు మున్సిపాలిటీలున్న నియోజకవర్గం నగరికి రాజకీయ ఉద్దండులు ప్రాతినిధ్యం వహించడంతో ప్రత్యేక గుర్తింపు వచ్చింది. తెలుగు, తమిళ సంస్కృతి, సంప్రదాయాల మేళవింపు ఈ నియోజకవర్గం విశిష్టత. ఇక్కడ నుంచి గెలిచిన ఎమ్మెల్యేల్లో గాలి ముద్దుకృష్ణమనాయుడు, రెడ్డివారి చెంగారెడ్డి, ఆర్‌కే రోజా, ఈవీ గోపాల్‌రాజు రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం పొందారు. నిండ్ర మండలం కొప్పేడుకు చెందిన చెంగారెడ్డి ఇక్కడ నుంచి 8 సార్లు పోటీ చేసి ఐదుసార్లు విజయం సాధించారు. వడమాలపేట మండలం తప్ప మిగిలిన అన్ని మండలాల్లో తమిళులు గెలుపోటములను శాసించే స్థాయిలో ప్రభావం చూపుతున్నారు. తమిళనాడు సరిహద్దుకు ఆనుకుని ఉండడంతో అక్కడి వివిధ పరిణామాలు ఇక్కడి ఓటర్లపై ప్రభావం చూపుతుంటాయి.

- పుత్తూరు అర్బన్



ఎమ్మెల్యేలు

1962-దొమ్మరాజు రాజగోపాల్‌రాజు	- ఇండిపెండెంట్
1967-కిలారి గోపాల్‌నాయుడు	- కాంగ్రెస్
1972 - కిలారి గోపాల్‌నాయుడు	- కాంగ్రెస్
1978 -రెడ్డివారి చెంగారెడ్డి	- కాంగ్రెస్
1983 -ఈవీ గోపాల్‌రాజు	- టీడీపీ
1985 -రెడ్డివారి చెంగారెడ్డి	- కాంగ్రెస్
1989 -రెడ్డివారి చెంగారెడ్డి	- కాంగ్రెస్
1994 -వీ. దొరస్వామిరాజు	- టీడీపీ
1999 - రెడ్డివారి చెంగారెడ్డి	- కాంగ్రెస్
2004 - రెడ్డివారి చెంగారెడ్డి	- కాంగ్రెస్
2009 -గాలి ముద్దుకృష్ణమనాయుడు	- టీడీపీ
2014 -ఆర్‌కే రోజా	- వైసీపీ
2019 -ఆర్‌కే రోజా	- వైసీపీ

ఓటర్ల సంఖ్య: 2,01,768
పురుషులు: 98,177 - స్త్రీలు: 1,03,583
ఇతరులు: 08

నియోజకవర్గం ఆవిర్భావం : 1962
ఎన్నిసార్లు ఎన్నిక జరిగింది : 13

నియోజకవర్గం పరిధి : విజయపురం, నిండ్ర, నగరి రూరల్, పుత్తూరు రూరల్, వడమాలపేట. **మున్సిపాలిటీలు :** నగరి, పుత్తూరు

వి.కోట..విజయబాట


పలమనేరు అసెంబ్లీ నియోజకవర్గంలో వి.కోట మండల ఓటర్ల తీర్పు విజయాన్ని ప్రభావితం చేయనుంది. ఈ మండలమే నిర్ణయాత్మక శక్తిగా అభ్యర్థులు భావిస్తున్నారు. నియోజకవర్గంలో ఐదు మండలాలతో పాటు ఒక మున్సిపాలిటీ ఉంది. 2,67,635 మంది ఓటర్లున్న ఈ నియోజకవర్గంలోని మండలాల వారీగా పరిశీలిస్తే పెద్దపంజాణిలో 44,712, గంగవరంలో 44,777, బైరెడ్డిపల్లి మండలంలో 43,377, పలమనేరులో 23,681, పలమనేరు మున్సిపాలిటీలో 41, 535 మంది ఓటర్లు ఉన్నారు. ఒక్క వి.కోట మండలంలోనే 70,583 మంది ఓటర్లు ఉండటం విశేషం. నియోజకవర్గంలోని ఓటర్లలో 26 శాతం మంది ఈ మండలంలోనే ఉన్నారన్నమాట. దీంతో అభ్యర్థి గెలుపులో వి.కోట మండల ప్రజల తీర్పు కీలకం కానుంది.

- పలమనేరు



ఎమ్మెల్యే, ఎంపీగా.. రామకృష్ణారెడ్డి

● హ్యాట్రిక్ వీరులు



ఓటమి ఎరుగని ధీరుడిగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నూతనకాల్వ రామకృష్ణారెడ్డి పేరొందారు. పుంగనూరు ఎమ్మెల్యేగా, చిత్తూరు ఎంపీగా హ్యాట్రిక్ విజయాలు సాధించి అరుదైన రికార్డు సొంతం చేసుకున్నారు. నాటి పుంగనూరు నియోజకవర్గంలోని పెద్దపంజాణి మండలం కెళవాతికి చెందిన ఎన్.రామకృష్ణారెడ్డి వార్డు సభ్యుడి నుంచి సర్పంచి, చౌడేపల్లె పంచాయతీ సమితి అధ్యక్షుడు, చిత్తూరు జడ్పీ ఛైర్మన్‌గానూ వ్యవహరించారు. 1983లో పుంగనూరు టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన ఆర్టీసీ కండక్టర్ బగ్గిడి గోపాల్ ఎమ్మెల్యేగా ఎన్నికై ఎన్టీఆర్‌పై తిరుగుబాటు చేశారు. 1985లో టీడీపీ అభ్యర్థిగా ఎన్.రామకృష్ణారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి కె.పద్మావతమ్మ, 1989లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆర్.వేణుగోపాల్ రెడ్డి, 1994లో స్వతంత్ర అభ్యర్థి శ్రీధర్‌రెడ్డిపై పోటీ చేసి వరుసగా మూడు పర్యాయాలు రామకృష్ణారెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికై హ్యాట్రిక్ కొట్టారు. అలాగే, 1996లో తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి చిత్తూరు ఎంపీగా పోటీ చేసి గెలుపొందారు. ఈ సందర్భంగా జరిగిన ఉప ఎన్నికలో పుంగనూరు ఎమ్మెల్యేగా ఆయన కుమారుడు ఎన్.అమరనాథరెడ్డి గెలిచారు. అలాగే 1998, 1999ల్లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు ఎంపీగా రామకృష్ణారెడ్డి పోటీ చేసి గెలిచారు. చీ

- పుంగనూరు

ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి

నియోజకవర్గాల పునర్విభజన వల్ల పీలేరు నుంచి పుంగనూరు వచ్చి 2009, 2014లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి టీడీపీ అభ్యర్థి ఎం.వెంకటరమణరాజుపై రెండుమార్లు, 2019లో టీడీపీ అభ్యర్థి ఎన్.అనీషారెడ్డిపై వరుసగా మూడుమార్లు గెలిచారు. పుంగనూరు ఎమ్మెల్యేలుగా ఇద్దరు హ్యాట్రిక్ సాధించారన్న మాట.

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు


కలకడలో నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న దగ్గుబాటి వెంకటేశ్వరరావు


మదనపల్లెలో చంద్రబాబు జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేస్తున్న టీడీపీ శ్రేణులు


కురబలకోటలో చంద్రబాబు జన్మదిన వేడుకలలో కూటమి అభ్యర్థి జయచంద్రారెడ్డి తదితరులు


పీలేరులో నల్లారి అమరనాథరెడ్డితో కలిసి కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు


:గుర్రంకొండ, నిమ్మనపల్లెలో చంద్రబాబు జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్‌చేస్తున్న టీడీపీ శ్రేణులు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 20: టీడీపీ అధినేత నారాచంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను టీడీపీ శ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. శనివారం మదనపల్లె టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా స్థానిక సుభాష్‌రోడ్డులోని ఆయన నివాసం వద్ద చంద్రబాబు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు ఎస్‌ఏ మస్తాన్, నాదెళ్ల శివన్న, ఆర్‌కే రామకృష్ణాచారి, శివప్రసాద్, సంగం శ్రీనివాసులు, ఎస్‌ఎం రఫీ, తులసి, నీలకంఠ, జేసీబీ ఈశ్వర, మధు, వేణు, జీవీ నాయుడు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్ కోసం టీడీపీ అధినేత చంద్రబాబు ఆయురారోగ్యాలతో వర్థిల్లాలని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ కోరారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో చంద్రబాబునాయుడు 75వ జన్మదిన వేడుకలను సందర్భంగా కేక్‌కట్ చేసి టీడీపీ నాయకులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివాళా తీస్తున్న రాష్ట్రాన్ని ఆదుకోవాలంటే చంద్రబాబు మళ్లీ సీఎం కావాల న్నారు. కార్యక్ర మంలో విజయమ్మ, గండికోట గణేష్, రాటకొండ రాజేష్, ప్రణయ్ పాల్గొన్నారు.

పీలేరులో: తమ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను శనివారం పీలేరులోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి తనయుడు నల్లారి అమరనాథరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి తిరిగిగాడిలో పడాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. పీలేరులో నల్లారి కిశోర్ కుమార్ రెడ్డిని, రాజంపేట ఎంపీగా నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పురం రామ్మూర్తి, శ్రీనాథరెడ్డి, సురేంద్ర,లక్ష్మీకర, శివారెడ్డి, పురుషోత్తం రెడ్డి, గుర్రం నగేష్, లక్ష్మీకాంతమ్మ, హనీఫ్, ముబారక్, విజయ్, పఠాన్ మౌలా, రెడ్డిముని, వెంకటరమణ నాయక్, సురేశ్, మల్లి, చిన్నా పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను శనివారం వాల్మీకిపురంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం స్థానిక చౌడేశ్వరిదేవి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, రొట్టెలు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్ర మంలో మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, నాయకులు గాంధీపేట రమణ, పీవీ నారాయణ, రాజేంద్రాచారి, సురేంద్రవర్మ, వల్లిగట్ల వెంకటరమ ణ,చంద్రమౌళి, కువైట్ బాబు, సయ్యద్‌బాషా, జావీద్ పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో: స్థానిక టీడీపీ కార్యాలంయంలో శనివారం టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబునాయడు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేకు కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేసి ఎమ్మెల్యే అభ్యర్థి షాజహాన్‌బాషాను గెలిపించి ముఖ్యమంత్రిగా చంద్రబాబును చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్ర మంలో రాజన్న, రమణ, శ్రీపతి, మహమ్మద్ రఫి, శ్రీరాములు, మల్లికార్జున, రెడ్డెప్ప, శంకర, చెం గ్రాయుడు, ఖాసీమ్‌ఖాన్, రమణ పాల్గొన్నారు.

గుర్రంకొండలో:తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను శనివారం ఆ పార్టీ నాయకులు గుర్రంకొండలో ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్‌కుమార్, మురళీ, చలమారెడ్డి, మేకల చలపతి, సుంకర శేఖర్, సుబ్బరాజు, రామాంజులు, చిన్న రెడ్డి, రంజిత్, సురేంద్ర, సుధాకర్, మోహన్ పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, స్వర్ణాంధ్ర సృష్టికర్త, నారా చంద్రబాబు నాయుడి జన్మదిన వేడుకలను పీటీఎంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లె క్రాస్‌లో టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన నాయకులు బారీ కేక్ ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నాయకులు ఆంధ్ర రాష్ట్ర ప్రజల కోసం అలుపెరుగని పోరాట యోదుడిగా అహర్నిశలు శ్రమిస్తున్నారంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

కురబలకోటలో: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడిని సీఎం చేయడమే ధ్యేయమని తంబళ్లపల్లె టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం చంద్రబాబునాయుడి జన్మదిన వేడుకలసందర్భంగా కేక్‌కట్ చేసి స్వీట్లు, పండ్లు పంచి పెట్టారు. నియోజకవర్గ పరిశీలకుడు సీడ్ మల్లికార్జున నాయుడు, రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్, కార్యదర్శి అయూబ్ బాషా, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పర్వీన్‌తాజ్, మండలాధ్యక్షుడు వైజీ సురేంద్ర, మాజీ ఎంపీపీ తిమ్మ రాయుడు, నూరి, తెలుగు యువత అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి, మధుకర్ రెడ్డి, రెడ్డెప్ప, సోము, రామచంద్ర, రమేష్, లక్ష్మన్న, వెంక టరమణా రెడ్డి, మోహన్‌రెడ్డి, భాస్కర్, ఆలం, సదాశివ, చంద్ర, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కలకడలో:టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడు కలను కలకడలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో పార్టీ సీనియర్ నాయకుడు దగ్గుబాటి వెంకటేశ్వర రావు మన పెద్దాయనకు జన్మదిన శుభాకాంక్షలు అనే నినాదంతో ప్రత్యేకంగా తయారు చేయించిన 75 కిలోల కేక్ కట్‌ను కట్ చేసి నాయకులు తినిపించుకున్నారు.

చంద్రబాబుకు వీరాభిమాని దగ్గుబాటి

కలకడ, ఏప్రిల్ 20:టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుని ఆరాధ్య దైవంగా భావించే దగ్గుబాటి వెంకటేశ్వరరావు 1992 నుంచి క్రమం తప్పకుండా ఆయన జన్మదిన వేడుకల సందర్భంగా ఏదో ఒక సామాజిక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అధిక సంఖ్యలో హాజరై పార్టీ శ్రేణుల నడుమ పెద్దాయన వయస్సుకు సమాన బరువున్న కేక్‌ను కట్ చేయడం పరిపాటి. గతంలో చంద్ర బాబు జన్మదిన వేళ వాల్మీకీపురంలోని కోదండ రామాలయానికి రూ1.05 లక్షల విలువ చేసే బంగారు హారణి బహూకరించారు. ప్రతి ఏటా ఈ సంబరాల వేళ ఎన్టీఆర్ ట్రస్టుకు రూ.లక్ష వంతున విరాళాన్ని ఇస్తువస్తున్నారు. అదే విధంగా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా తన కుమా రుడు పొందిన తొలి నెల జీతాన్ని ట్రస్ట్‌కు అందజేశారు. అలాగే 2018 నుంచి జననేత నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి జన్మదిన రోజైన సెప్టెంబరు 13వ తేదీ కూడా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించ డంలో ముందున్నారు. టీడీపీ అభివృద్ధికి నిరంతరంగా కృషి చేస్తున్నారు. కార్యక్రమంలో నేతలే మల్లారపు రవిప్రకాశ్, సూర్యప్రకాశ్, పొత్తూరి ప్రభాకర్‌నాయుడు, శ్రీనివాసులరెడ్డి, తిరుపతినాయుడు, వెంకటరమణనాయుడు, కాంతారావు, పునీత్‌చౌదరి, తారకేశ్వర, చంద్రమోహన్, త్యాగరాజు, శ్రీనివాసులనాయుడు, ఆనంద్‌నాయుడు, పీవీ నాయుడు, వసంతనాయుడు, రమణనాయుడు, వాటర్‌షెడ్ రవి, ఆనంద్‌రెడ్డి, జనార్ధన్ నాయుడు, చంద్రబాబునాయుడులు పాల్గొన్నారు.

హంసవాహనంపై పట్టాభిరాముడు

● వేడుకగా వసంతోత్సవం ● గంగాలంలోనే చక్రస్నానం


హంస వాహనంపై సీతాలక్ష్మణ సమేత పట్టాభిరాముడి నగరోత్సవం

వాల్మీకిపురం, ఏప్రిల్ 20: వాల్మీకిపురం పట్టాభిరాముడి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం టీటీడీ ఆధ్వర్యంలో సీతారామలక్ష్మణులను హంసవాహనంపై అధిష్టింపచేసి తిరుమాడ వీధులలో ఊరేగి భక్తులను కటాక్షించారు. ఉదయం సుప్రభాతసేవ, ఆలయంలోని మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం సాయంత్రం ఆలయంలోని మండపంలో పట్టాభిరాముడి ఊంజల్‌సేవ కన్నుల పండువగా సాగింది. మహిళల చలిపిండి దీపారాధనలు వెన్నంటి రాగా మంగళవాయిద్యాలు, టీటీడీ సాంస్కృతిక కార్యక్రమాలు, బాణాసంచా నడుమ హంసవాహనంపై పట్టాభిరాముడి నగరోత్సవం వైభవంగా జరిగింది. రాత్రి ఏకాంత పూజలతో ధ్వజావరోహణ కార్యక్రమంతో స్వామి వారి ఉత్సవాలు ముగిశాయి. కార్యక్రమాలలో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ వెంకటస్వామి, ఆగమ సలహాదారులు శ్రీనివాసాచార్యులు, ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, కృష్ణప్రసాద్, కృష్ణరాజు, భాషికాచార్యులు, రామ్‌గోపాల్ బృందం, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం చివరి రోజున ఉదయం స్నపనతిరుమంజనం, సాయంత్రం పట్టాభిరాముడికి పుష్పయాగం కార్యక్రమాలు జరగనున్నాయి.

గంగాళమే మహద్భాగ్యమా...

వాల్మీకిపురం పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలను ఎంతో వైభవంగా నిర్వహించే టీటీడీ చక్రస్నానం ఘట్టం విషయంలో సంవత్సరాల కాలంగా నిర్లక్ష్యం వహి స్తోందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని కోనేటివీధిలో ఉన్న గరుడ పుష్కరిణిని ప్రతియేటా పరిశీలించి వెళ్లే టీటీడీ అధికారులు ఏమాత్రం పట్టించుకుంటున్నారో ఈ చక్రస్నాన ఘట్టం చూస్తేనే అర్థమవుతోంది. ఏడేళ్లుగా పట్టాభిరాముడి బ్ర హ్మోత్సవాలలో చక్రస్నానం ఘట్టం గంగాలంకే పరిమితమవుతోంది. ఈ వేడుకలు కనీసం భక్తులు తిలకించకపోగా ఆలయంలోనే సరిపెడుతున్నారు. ఇప్పటికైనా టీటీడీ అధికారులు స్పం దించి వచ్చే ఏడాది బ్రహ్మోత్సవాలకైనా గరు డ పుష్కరిణిని అభివృద్ధి చేసి ఘనంగా నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

ఖైదీ మృతికి కారణమైన వారిని సస్పెండ్ చేయాలి

పీలేరు, ఏప్రిల్ 20: మదనపల్లె సబ్-జైలులో రిమాండు ఖైదీ మృతికి కారణమైన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని మాలమహానాడు పీలేరు మండల అధ్యక్షుడు గుండ్లూరు రవీంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీలేరులో శనివారం విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ రిమాండు ఖైదీ మొగిలప్ప మృతికి కారణమైన ఎస్‌ఐ శ్రీనివాసులు, పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్, మదనపల్లె జైలు సూపరింటెండెంట్ రామకృష్ణ యాదవ్‌లను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. అవిటి వాడైన మొగిలప్ప మద్యం అమ్ముతున్నాడన్న తప్పుడు కేసు నమోదు చేయడంతో తీవ్ర మానసిక వేదనకు గురై ఆయన చనిపోయాడన్నారు. మొగిలప్ప కుటుంబానికి రూ.25 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రజాదరణ ఓర్వలేక వైసీపీవారే దాడి చేశారు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 20: తంబళ్లపల్లెలో నామినేషన్‌కు విచ్చేసిన జనసందోహం చూసి ఓర్వలేకనే వైసీపీ నాయకులు పోలీసులపైదాడి చేసి విధ్వంసం సృష్టించారని తంబళ్లపల్లె టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం మదనపల్లె డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీని కలిసి వీడియోలు అన్ని అందజేశామని క్షుణంగా పరిశీలించి సంఘటనపై విచారణ జరపాలని కోరారు. అనంతరం అక్కడే మీడియాతో ఆయన మాట్లాడుతూ నామినేషన్ సందర్భంగా అధిక జనవ రావడంతో అక్కడ 200మీటర్ల వరకే బారీకేడ్లు ఏర్పాటు చేశారని, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు చుట్టుపక్కల ఉండడంతో పోలీసులు దురుషుగా మాట్లాడుతూ లాఠీ చార్జీ నిర్వహించాని ఆరోపించారు. ఈ విషయాలను పసిగట్టిన వైసీపీ నాయకులు ఇదే అదునుగా తీసుకుని పోలీసులపై రాళ్లదాడి చేశారని తెలిపారు. టీడీపీ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమం ర్యాలీలో వైసీపీ వాహనాలు, నాయకులు ఉన్న దృశ్యాలను డీఎస్పీ ప్రసాద్‌రెడ్డికి అందజేశామన్నారు. ఈ సంఘటనలో రాళ్లదాడిలో ట్రైనీ డీఎస్పీకి స్వల్పంగా గాయమైందని అది దరదృష్టమన్నారు. కార్యక్రమంలో సీడ్ మల్లికార్జున నాయుడు, శేషాద్రిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, మంత్రిప్రసాద్, సురేంద్రయాదవ్, విశ్వనాధరెడ్డి, బీఎంఆర్, వైజీ సురేంద్రయాదవ్, తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మద్యానికి డబ్బివ్వలేదని తల్లిపై గొడ్డలితో తనయుడి దాడి

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 20: మద్యం తాగేందుకు తన తల్లి వెంకటరమణమ్మ(80) డబ్బులు ఇవ్వలేదని ఆగ్రహించిన చిన్న కొడుకు లక్ష్మయ్య(40) గొడ్డలితో తల్లి కాలును నరికాడు. వాల్మీకిపురం మండలం పత్తేపురం గ్రామానికి చెందిన లక్ష్మయ్య మద్యానికి బానిసై నిత్యం డబ్బులు ఇవ్వమని తల్లిని వేధించేవాడు. ఈ క్రమంలో శనివారం డబ్బులు ఇవ్వాలని తల్లిని అడుగగా ఆమె లేవనడంతో ఆగ్రహించిన లక్ష్మయ్య పక్కనే వున్న గొడ్డలి తీసుకుని తల్లి కాలుపై మూడు చోట్ల నరికాడు.

ప్రజల ఆదరణ జీవితాంతం గుర్తుపెట్టుకుంటా

● నామినేషన్ మహోత్సవానికి వచ్చిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు
● ఒక్క అవకాశం కల్పిస్తే...తంబళ్లపల్లెను అభివృద్ధి పథంలో నడిపిస్తా
● తంబళ్లపల్లె అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి


మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, ఏప్రిల్ 20: మీరు చూపిన ఆదరణ జీవితాంతం గుర్తుపెట్టుకుంటా...నామినేషన్ మహోత్సవానికి ప్రతి ఒక్కరికి పేరు పేరున కృతజ్ఞతలని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. ములకలచెరువులోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన నామినేషన్ ఉత్సవానికి ప్రభంనంలా వచ్చిన ప్రజలు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మద్దతుదారులకు జీవితం రుణపడి ఉంటానన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో ప్రజల నుంచి వస్తున్న ఆదరణ జీవితాంతం మరిచిపోనన్నారు. ఇంతటి ఆదరణ చూపుతున్న ప్రతి ఒక్కరికి పాదాభివందనం చేస్తున్నానన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడానికి రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ఒక్క అవకాశం కల్పిస్తే రైతులను అన్ని విధాల ఆదుకుని బీడు భూములను సాగులోకి తెచ్చి కరువు ప్రాంతంగా పేరొందిన నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తానన్నారు. హంద్రీ - నీవా జలాలతో అన్ని చెరువులు, కుంటలను నింపుతానన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కరించేందుకు నియోజకవర్గానికి పరిశ్రమలు తీసుకొస్తానన్నారు. రాష్ట్రాభివృద్ధి టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడుతోనే సాధ్యమతుదుందన్నారు. తనతో పాటు రాజంపేట ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమా ర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కాగా ములకలచెరువు మండలంలోని బురకాయలకోటలో శనివారం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, టీడీపీ నేతలు ముత్తుకూరు మౌలా, జేసీబీ సుధాకర్‌నాయుడు, విజయ్‌కుమార్‌లు కేక్‌ను కట్ చేసి ప్రజలు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు మురళీస్వామి, కుమారస్వామిరెడ్డి, బంకు నరసింహులు, చెన్నకేశవ, గోపాల్‌రాజు, తిప్పరాజు, మారెప్ప, వెంకటరమణ, రషీద్, ఇబ్రహీం, రసూల్, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ ఇవ్వలేదని ఆందోళన

తంబళ్లపల్లె, ఏప్రిల్ 20: తంబళ్లపల్లె మండల కేంద్రంలోని 37వ చౌకదుకాణ పరిధిలో ఎండీయూ వాహనదారుడు ఏప్రిల్ నెల కోటా బియ్యం ఇంత వరకు ఇవ్వలేదని కార్డుదారులు ఆందోళన చేశారు. చౌకదుకాణ పరిధిలో సుమారు 384 మంది కారుదారులు ఉన్నారు. 20 రోజులు గడుస్తున్నా రేషన్ బియ్యం పంపిణీ చేయలేదని కార్డుదారులు వాపోతున్నారు. తహసీల్దారు బ్రహ్మయ్య కార్డుదారుల వద్దకు వచ్చి ఇంటి వద్దకే రేషన్ బియ్యం అం ది స్తామని హామీఇచ్చారు.

విద్యార్థికి తీవ్ర గాయాలు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 20: టెంకాయ చెట్టు ఎక్కిన రియాజ్(19) అనే విద్యార్థి చెట్టుపై పాము కనపడటంతో పైనుంచి దూకేసాడు. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. కలికిరి మండలం టేకలకోన గ్రామానికి చెందిన రియాజ్ డిగ్రీ చదువుతున్నాడు.

రాష్ట్రంలో కూటమి ప్రభంజనం తథ్యం


నల్లారి కిశోర్ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు


పీలేరులో కేక్ కట్ చేస్తున్న నల్లారి తనూజా రెడ్డి, నల్లారి షమా రెడ్డి

కలకడ, ఏప్రిల్ 20:రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అనుకూల ప్రభంజనం తథ్యమని పీలేరు నియోజకవర్గ కూటమి అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన కలకడ పట్టణంలోని జీకేరోడ్డు, చెరువుబండరోడ్డు, మెయిన్‌రోడ్డుల్లో నాయకులతో కలిసి బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింట ప్రచారం నిర్వహించి కరపత్రాలను అందజేసి సూపర్ సిక్స్ పథకాలు గురించి ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలకడ ప్రజల దాహార్తిని తీర్చడానికి మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో ప్రత్యేక శ్రద్ధ చూపి ఝరి కోన నుంచి పైప్ లైన్ ద్వారా తాగునీటి సదుపాయాన్ని కల్పించినట్లు తెలిపారు. అయితే ఝరి కోన నిర్వాహణను ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. దీంతో గ్రామాల్లో ప్రజలు తాగు నీటి కోసం ఇబ్బందులు పడుతుంటే బాధగా ఉందన్నారు. ప్రజా సేవకు చిత్తశుద్ధితో పని చేసే రాజంపేట పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, అలాగే పీలేరు నియోజకవర్గ టీడీపీ ఉమ్మడి అభ్యర్థి అయిన తనకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు పలకాలని కోరారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ పాలనతోనే రాష్ట్రం ముందుకు వెళతుందని ఓటర్లు గమనించాలని కోరారు. కార్యక్రమంలో తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లారపు రవిప్రకాశ్, అధికార ప్రతినిధి సూర్యప్రకాశ్, బీజేపీ కన్వీనర్ పొత్తూరి శ్రీకాంత్, నాయకులు బరకం శ్రీనివాసులరెడ్డి, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, మద్దిపట్ల వెంకటరమణనాయుడు, పొత్తూరి ప్రభాకర్‌నాయుడు, మల్లికార్జుననాయుడు, కాంతారావు, తిరుపతినాయుడు, బీవీస్వామి, చంద్రమోహన్, త్యాగరాజు, రైస్‌మిల్ రమణ, తారకేశ్వర, మునాఫ్, షబ్బీర్ అహ్మద్, కరీముల్లా, జిలానీ, ఇనాయతుల్లా, ఇర్ఫాన్, ఖాజా, నౌషాద్, ఇమ్రాన్, అలీ, జాఫర్, మున్వర్, రెడ్డెప్పలు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి పలువురు చేరిక

బాటవారిపల్లె పంచాయతీ గరుడప్పగారిపల్లె, కొత్తగాండ్లపల్లెకు చెందిన పలువురు వైసీపీ వర్గీయులు కూటమి అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. పార్టీ తీర్థం పుచ్చుకున్నవారిలో ఇంజేటి హేమంత్‌కుమార్, గిరిధర్, వెంకటరెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, సాయికుమార్, ప్రకాశ్, సుబ్బరామయ్య, రెడ్డిప్రసాద్‌లు ఉన్నారు.

చంద్రబాబు సీఎం అయిన వెంటనే రూ.4 వేల పింఛన్

పీలేరు, ఏప్రిల్ 20: టీడీపీ అధినేత నారాచంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన వెంటనే వృద్ధులకు భద్రతా పింఛన్‌ను రూ.4 వేలకు పెంచుతారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి సతీమణి నల్లారి తనూజా రెడ్డి, కోడలు నల్లారి షమా రెడ్డి తెలిపారు. పీలేరు పట్టణం మోడల్ కాలనీలో శనివారం వారిద్దరూ టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి ఉధృతంగా ఇంటింటి ప్రచారం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న రూ.3 వేల పింఛన్‌ను చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే ఏప్రిల్ మాసంతో కలిపి రూ.4 వేలుగా ఇస్తారని వారు ప్రజలకు తెలిపారు. మహిళాభివృద్ధి కోసం చంద్రబాబు ఇప్పటికే 'మహాశక్తి' పథకం ప్రకటించారని ఇందులో ముఖ్యంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రకటించారన్నారు. ప్రస్తుత వైసీపీ పాలనలో మద్యం కారణంగా కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నం అయిందన్నారు. మోడల్ కాలనీలో తమ వెంట ఉన్న మహిళలతో కేక్ కట్ చేయించి అందరికీ పంచి పెట్టారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్ రెడ్డి, మల్లెల రెడ్డిబాషా, సాధన, దేవిరెడ్డి వెంకటరమణా రెడ్డి, నల్లారి రియాజ్, ఆతిఖా షఫీ, రహంతుల్లా, బాబు రెడ్డి, సుభాష్, అత్తార్ చాను, వసుంధర, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.